



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 12 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 2 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# పెన్షన్లలో ఏపీ టాప్

- ప్రతి వంద మందిలో 13 మందికి పింఛన్లు: ముఖ్యమంత్రి
- లబ్ధిదారుల్లో 59% మంది మహిళలే.. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం
- ఆడబిడ్డలు కష్టపడకూడదనే దీపం 1, 2
- 45 రోజుల్లోనే బస్సుల్లో 10 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' నిధులు విడుదల
- తల్లికి వందనం పథకం కాదు.. పిల్లలపై ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి
- 15 నెలల్లో 4.7 లక్షల మందికి ఉద్యోగాలు
- 10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయ్
- వీటితో 9 లక్షల ఉద్యోగాలు వస్తాయ్
- 2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా చదువుకున్న పిల్లలకు ఇస్తున్న 'తల్లికి వందనం' పథకం కాదు. అది ప్రభుత్వం తరపున పిల్లలపై పెట్టుబడి. రేపటి తరంపై పెట్టుబడి పెట్టి చదివిస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో 9 పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపారు. మేం ట్రూడౌన్ పేరుతో చార్జీలు తగ్గిస్తున్నాం. నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసల చొప్పున తగ్గనుంది. రానున్న రోజుల్లో పొలాల్లో సోలార్ సిస్టమ్‌ను తీసుకొస్తాం. సామాజిక పెన్షన్ల పంపిణీలో మన రాష్ట్రమే అగ్రస్థానంలో ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశంలో మరే ప్రభుత్వమూ ఈ స్థాయిలో పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రతి 100 మందిలో 13 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల్లో 59 శాతం మంది మహిళలేనని చెప్పారు. - మిగతా2లో

నేడు విజయదశమి సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున రేపు (శుక్రవారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.



## డిసెంబర్‌లో పుతిన్ భారత్ రాక

- ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్న తరుణంలో పుతిన్, ప్రధాని మోదీల భేటీ కీలకంగా మారనుంది
- సుంకాల విషయమై న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతల మధ్య రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ రానుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది
- భారత్- రష్యాలు ఎన్నో ఏళ్లుగా ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలు కలిగివున్నాయి.

5




## ఖర్గేకు పేస్‌మేకర్

- హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో అమర్చిన వైద్యులు
- ప్రస్తుతం ఆయన నిలకడగా ఉన్నా ఆరోగ్యం

# చొరబాటుదారులతో జాగ్రత్త

- 'జనాభా'ను మార్చేయడమే వారి లక్ష్యం
- ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని వ్యాఖ్యలు
- సామాజిక సామరస్యం దెబ్బతిని, అంతర్గత భద్రత ప్రమాదంలో పడుతుంది
- జాతి నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ గొప్ప భూమిక
- దేశమే ప్రథమం అనే భావనతో ఆర్ఎస్ఎస్ పని చేస్తోంది
- పేదల జీవితాలను మార్చేందుకు కృషిచేసింది




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వైవిధ్యం, సమైక్యత...భారతదేశ బలాలని, వాటికి చొరబాటుదారులు ముప్పుగా మారారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు. వీరి ప్రయత్నాలు ఫలిస్తే దేశం బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది వేడుకల్లో బుధవారం మోదీ పాల్గొనారు. "జనాభాలో గణనీయమైన మార్పు కోసం చొరబాటుదారులు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల సామాజిక సామరస్యం దెబ్బతిని, అంతర్గత భద్రత ప్రమాదంలో పడుతుంది" అని మోదీ తెలిపారు. చొరబాటుదారులు ఈ దేశ యువత ఉపాధిని లాగేసుకోకుండా చూడటం, సోదరీమణులు, కుమార్తెలను వారినుంచి రక్షించుకోవడాన్ని ఈ మిషన్ లక్ష్యంగా ఆయన నిర్దేశించారు. జాతి నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ గొప్ప భూమికను పోషించిందని మోదీ అన్నారు. - మిగతా2లో

# రాష్ట్ర రాబడి పైపైకి!




- కేంద్రం, రాష్ట్రంలో పెరిగిన పన్ను వసూళ్లు
- దేశంలో గత ఏడాదికంటే 9.1 శాతం అధికం
- రాష్ట్రంలో 4 శాతం మేరకు పెరిగిన ఆదాయం
- శ్లాబులు మారితే ఆదాయం తగ్గుతుందన్న మార్కెట్ నిపుణుల వాదన బుట్టదాఖలు

2

## గాజాలో దయనీయ స్థితి



- ఆహారం కావాలంటే కోరిక తీర్చాల్సిందే:
- ఇజ్రాయెల్-హమాస్ మధ్య నలిగిపోతున్న గాజా ప్రజలు
- తమ పిల్లలకింత తిండిపెట్టాలని ఆరాటపడుతూ ఏదైనా ఉపాధి దొరుకుతుందేమోనని చూసే మహిళలకు మాత్రం దారుణ పరిస్థితులు



## రక్షణ రంగం అభివృద్ధికి వినూత్న వ్యవస్థ

- పరిశోధనను, అభివృద్ధిని బలోపేతం చేయడానికి వినూత్న వ్యవస్థను వృద్ధిచేస్తాం
- పస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగింది
- ఇది మనకు ఆందోళన కలిగించే విషయం
- బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయ్యింది

5

# ఏపీని ఈ రకంగా దెబ్బతీస్తుంటే ఎలా బాబూ?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మీరు రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేశారు
- రాష్ట్రానికి సంబంధించిన హక్కులను కాపాడే ఉద్దేశం ఏ కోశానా మీలో కనిపించడంలేదు
- ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చకాచకా అడుగులేస్తుంటే, వారి కేబినెట్లో వారు ఎత్తు పెంచడానికి ఆమోదం తెలుపుకుంటే, కనీసం మీకు చీమకుట్టినట్టైనా లేదు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్ర ప్రయోజనాల్ని గాలి కొదిలేశారంటూ చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చకాచకా అడుగులేస్తుంటే, వారి కేబినెట్లో వారు ఎత్తు పెంచడానికి ఆమోదం తెలుపుకుంటే, కనీసం మీకు చీమకుట్టినట్టైనా లేదా అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. చంద్రబాబూ.. మీరు రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేశారు. రాష్ట్రానికి సంబంధించిన హక్కులను కాపాడే ఉద్దేశం ఏ కోశానా మీలో కనిపించడం లేదు. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చకాచకా అడుగులేస్తుంటే, వారి కేబినెట్లో వారు ఎత్తు పెంచడానికి ఆమోదం తెలుపుకుంటే, కనీసం మీకు చీమకుట్టినట్టైనా లేదు. అనేక ప్రాంతాలు సాగునీరు, తాగునీరు లేక ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉన్నాసరే మీరెందుకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు? రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన స్థానంలో ఉన్న మీరే, రాష్ట్రాన్ని ఈ రకంగా - మిగతా2లో

# సంస్కృతి సంప్రదాయ వేడుకలకు వేదిక గాంధీ క్షేత్రం





**దసరా సందర్భంగా గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో వంటల పోటీలు**
**ఉత్సాహంగా పాల్గొని చక్కని వంటలు చేసిన మహిళలు**
**విజేతలకు బహుమతులు అందచేసిన ఎమ్మెల్యే సతీమణి విజయలక్ష్మి**

అవనిగడ్డ

సంస్కృతి సంప్రదాయ వేడుకలకు గాంధీ క్షేత్రం వేదికగా నిలుస్తోందని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో వెంకట్రామ్, సాయి సుప్రియ దంపతుల ఆధ్వర్యంలో మహిళలకు నియోజకవర్గ స్థాయి వంటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ ప్రారంభించారు. మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొని తీపి వంటకాలు, మధుర పాయసాలు, ఘాటు హాటు వంటకాలు, పసందైన గారెలు, బూరెలు, తెలుగింటి రుచుల ప్రాముఖ్యత తెలియచేసే వంటలు, బలవర్ధక ఆహారాలు, నవరాత్రుల ప్రత్యేక వంటకాలు, వినూత్న రుచులతో విభిన్న వంటకాలు చేసి ఎమ్మెల్యే సతీమణి మండలి విజయలక్ష్మి చేతులమీదుగా నగదు బహుమతులు అందుకున్నారు. మొదటి బహుమతి రూ.7,500లు అవనిగడ్డ మల్లేశ్వరి, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఆకుల నాగలక్ష్మి సుగుణ కుమారి, మూడవ బహుమతి రూ.2,500లు పసుపులేటి నాగలక్ష్మి అందుకున్నారు. రేపల్లె లక్ష్మీ బాలమ్మ, నంబూరి పద్మజ నగదు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. పాల్గొన్న మహిళలు ప్రతి ఒక్కరికీ బహుమతులు అందచేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రం ఆవరణలో బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, మహిళా నాయకులు, మహిళలు బ్రతుకమ్మకు పూజలు చేసి ఆడి పాడి సందడి చేశారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విన్ కుమార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, విశ్వనాథపల్లి పాప, ఏఎంసీ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పెన్షన్లలో ఏపీ టాప్



-మొదటిపేజీ తరువాయి

సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం దత్తి గ్రామంలో బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందించిన తర్వాత ప్రజావేదికలో మాట్లాడారు. అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో రూ.500 మాత్రమే అందిస్తున్నారన్నారు. మానవత్వంతో ఆలోచించి పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి అందిస్తున్నామని తెలిపారు. ప్రతినెలా ఒక గ్రామానికి వచ్చి నేరుగా పర్యవేక్షిస్తున్నానని, ఇందులో భాగంగా ఈ రోజు మీ గ్రామానికి వచ్చానని సీఎం చెప్పడంతో గ్రామస్థులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ఒక్క పింఛన్ పెంపుతోనే సరిపెట్టలేదని.. సూపర్ సిక్స్ హామీలను అమలుచేసి సూపర్ హిట్ చేశామన్నారు. 'ఆడబిడ్డలు కష్టపడకూడదన్న కోణంలో ఆలోచించి నాడు దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు దీపం-2 కింద ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేలా సాహసోపేత నిర్ణయం తీసుకున్నాం. పథకం ప్రారంభించిన 45 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు' అని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాడు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చామని.. వాటికి మరింత చేయూతనందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఈనెల 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు జమ చేస్తామన్నారు. విజయనగరం జిల్లా పేదరికంలో ఉందని.. దాన్ని మార్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. వ్యవసాయం ప్రధాన ఆధారం కావడంతో ఆ రంగంలో మౌలిక వసతుల కల్పన, సాగునీటిపై దృష్టిపెడతామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఏడాదిలోనే మెగా డీఎస్సీని పూర్తిచేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. యువతకు అండగా ఉండి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదేనన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో 4,71,574 మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని.. 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

**ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా**

ప్రజల అరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం 2.50 లక్షల ఆరోగ్య బీమా అందజేస్తున్నాం. రానున్న రోజుల్లో కుటుంబానికి రూ.25 లక్షల బీమా ఇస్తాం. 2029నాటికి అందరికీ ఇళ్లు కట్టించి అందజేస్తాం. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలిస్తాం. జీఎస్టీ వల్ల రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గింది. అయినా భయపడలేదు.

**చివరి ఊపిరి ఉన్నంతవరకు పేదల కోసమే**

నా చివరి ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసమే పనిచేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తా. కష్టంలేని సుపరి పాలన అందించడమే నా లక్ష్యం. మని, ఒక్క రూపాయి లంచం లేకుండా ప్రజలకు సుపరి పాలన అందించేందుకు బాధ్యత తీసుకున్నాం. వాట్సాప్ ద్వారా పౌర సేవలు అందిస్తున్నాం. ఎక్కడ ఏది జరిగినా ఫోన్‌లో సమాచారం తెలుసుకుంటున్నాం. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలి.

**ప్రజలకు సేవలు ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత**

ప్రభుత్వ యంత్రాంగం తప్పు చేస్తే ప్రజల ముందు నిలబెడతాం. యంత్రాంగం పనితీరుపై రానున్న రోజుల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. గతంలో అధికారులు తప్పుచేస్తే చర్యలు తీసుకునేవాళ్లం. ఇక నుంచి అలా ఉండదు. ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉంది. వారు బాగా పని చేయకపోతే గతంలో తిట్టేవాడినని, ఇప్పుడు ప్రజల ముందు నిలబెడతున్నాం. హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్‌గా వర్క్ చేయాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పనిచే స్తే ప్రజలకు చక్కటి సేవలు అందుతాయి.

**భోగాపురం ఎప్పుడో పూర్తికావాలి..**

వెనుక బడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో రానున్న రెండేళ్లలో రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. విజయనగరం జిల్లాలోని తోటపల్లి, తారక రామతీర్థసాగర్, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ వంటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. నదులు అనుసంధాన ప్రక్రియ కూడా చేపడతాం. విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, యాక్సెంచర్ వంటి కంపెనీలు వస్తున్నాయి. లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు చేపట్టాం. ఎప్పుడో పూర్తికావల్సిన ఈ ప్రాజెక్టును గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. కూటమి అదికారం లోకి వచ్చిన తక్షణమే పనులు వేగవంతం చేశాం. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ విమానాశ్రయాన్ని ప్రాంరభిస్తాం. దీనివల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది.

**పీ-4 ద్వారా లక్ష మంది మార్గదర్శకులు**

సమాజంలో అట్టడుగులో ఉన్నవారిని ఆదుకోవాలి. ఆర్థిక అసమానతలు తగ్గించి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో లక్ష మంది మార్గదర్శకులు పది లక్షల మంది బంగారు కుటుంబాలను వృద్ధిలోకి తీసుకురానున్నారు (దత్తి గ్రామంలోని రెండు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న వారిని ముఖ్యమంత్రి అభినందించారు). రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తే ఖబడ్దార్. ఆడబిడ్డలకు స్వేచ్ఛ, రక్షణ కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ఇప్పుడు స్వాతంత్ర్యం వచ్చింది**

గత ప్రభుత్వంలో రహదారులకు ఇరువైపులా ఉన్న పచ్చనిచెట్లను నరికి పరదాలు కట్టుకుని పర్యటించేవారు. ఇప్పుడా విధానానికి స్వస్తి పలకడంతో ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది. నాకు కక్షగట్టడం తెలియదు.

**కిడ్నీ రోగి ఇంటికి సీఎం**

ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తి గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పొట్నూరు అప్పలరాజు ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్ అందజేశారు. ఆయన తల్లికి వృద్ధాప్య పింఛను ఇచ్చారు. వారితో కాసేపు కూర్చుని ముచ్చటించారు. గతంలో అప్పలరాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.65 లక్షలు వచ్చిందని, ఆయన తల్లి కిడ్నీ దానం చేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ప్రతి నెలా ఆయనకు రూ.10 వేలు, ఆయన తల్లికి రూ.6 వేల పింఛన్ అందుతోంది. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సెర్ప్ సీఈవో కరుణ్, జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రాబడి పైపైకి!

అమరావతి

వస్తు, సేవల పన్ను(జీఎస్టీ-2.0) శ్లాబుల మార్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తగ్గుతుందన్న వాదన బుట్టదాఖలైంది. నిత్యావసరాలు సహా.. ఇతర వస్తుల పన్నులు తగ్గడంతో వాటి విక్రయాలు పెరిగాయి. దీంతో సెప్టెంబరు నెల ద్వితీయార్ధంలో దేశవ్యాప్తంగా పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. అయితే, కొన్ని కొన్ని రాష్ట్రాల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. గత ఏడాది(2024) సెప్టెంబరులో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లుగా నమోదుకాగా.. ఈ ఏడాది అదే నెలలో రూ.1.89 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంటే 9.1 శాతం మేర పెరుగుదల కనిపించింది. అదేసమయంలో ఈ ఏడాది ఆగస్టులో వసూలైన రూ.1.86 లక్షల కోట్ల పన్నులతో పోల్చితే సెప్టెంబరు వసూళ్లు 1.5% అధికంగా ఉన్నాయి. దేశంలో జీఎస్టీ-2.0 సంస్కరణలు గత నెల 22 నుంచి అమలులోకి వచ్చాయి. ఫలితంగా 375 నిత్యావసర వస్తువులు సహా వస్తు సేవలు, ఆటోమొబైల్స్, గృహోపకరణాల వస్తువుల ధరలు దిగి వచ్చాయి. ఫలితంగా వాటికి డిమాండ్ పెరిగి విక్రయాలు పుంజుకున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. గత నెలలో స్థూల జాతీయాదాయం 6.8 శాతం మేరకు పెరిగి రూ.1.36 లక్షల కోట్లకు చేరింది. మరోవైపు దిగుమతుల ద్వారా పన్ను రాబడి కూడా 15.6% వృద్ధి చెంది.. రూ.52,492 కోట్లుగా నమోదైంది. ఇక, జీఎస్టీ రిఫండ్లు కూడా 40.1% మేరకు పెరిగి రూ.28,657 కోట్లుగా నమోదయ్యాయి. నికరంగా జీఎస్టీ వసూలు రూ.1.60 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే ఇది 5% అధికమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాలపై డెలాయిట్ పార్టనర్ ఎం.ఎస్. మణి స్పందిస్తూ.. జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల కారణంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించలేదనడానికి ఈ వసూళ్లు నిదర్శనమని తెలిపారు. సెప్టెంబరు వసూళ్లతో ఈ ఏడాది ఇప్పటివరకు సగటు పన్నుల రాబడి రూ.2 లక్షల కోట్లకు చేరువలో ఉన్నట్టు చెప్పారు.

**ఏపీలో ఇలా పెరిగింది!**

రాష్ట్రాల వారీగా చూస్తే.. ఏపీలో జీఎస్టీ వసూళ్లు గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే 4 శాతం మేరకు పెరిగాయి. గత ఏడాది సెప్టెంబరులో రూ.3,506 కోట్ల జీఎస్టీ వసూలు కాగా, ప్రస్తుతం రూ.3,653 కోట్లకు చేరింది. తెలంగాణలో మాత్రం జీఎస్టీ వసూళ్లు 5 శాతం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబరులో తెలంగాణలో రూ.5,267 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.4,998 కోట్లు మాత్రమే వచ్చాయి.

## పీఎంజే జువెల్స్ స్టోర్ ప్రారంభం

భీమవరం



దక్షిణ భారతదేశంలోని ప్రముఖ లగ్జరీ ఆభరణాల సంస్థ, తమ కలకాలం నిలిచే డిజైన్‌లు, చక్కటి కళాత్మకతకు ప్రసిద్ధి చెందిన పీఎంజే జువెల్స్ తమ నూతన స్టోర్ ను పట్టణంలో ప్రారంభించింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు), ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలీ, క్లస్టర్ మేనేజర్ షైక్ గాలి షరీఫ్, స్టోర్ మేనేజర్ ఆలపాటి శ్రీనివాస్ (నాని), సేల్స్ మేనేజర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభంతో, పీఎంజే జువెల్స్ ఇప్పుడు దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో 40 కంటే ఎక్కువ స్టోర్లతో తమ ఉనికిని బలోపేతం చేసుకుంది. ప్రారంభ వేడుకలలో భాగంగా, ఈ బ్రాండ్ భీమవరం స్టోర్‌లో 8 రోజుల పాటు పెళ్లి, హాఫ్ శారీ ఆభరణాల ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. ఇది వారసత్వ ప్రేరణ పొందిన కలెక్షన్లు, ఆధునిక కళాఖండాల గొప్ప ప్రదర్శనను అందిస్తుంది. నూతన స్టోర్ నందు క్లిష్టమైన టెంపుల్ జ్యువెలరీ, పురాతన బంగారు నెక్లెస్‌లు, వడ్డాణాలు, ప్రత్యేక పెళ్లి సెట్‌లు, హాఫ్ శారీ జ్యువెలరీతో పాటు వజ్రాలు, రంగుల రత్నాలు, కుందన్, పోల్కీ, జడావు వర్క్‌తో అలంకరించబడిన ఆభరణాలు ఉన్నాయి. నెక్లెస్‌లు, చెవిపోగులు, రింగులు వంటి తేలికపాటి రోజువారీ ధరించే ఆభరణాలు కూడా క్యురేటెడ్ ఆఫరింగ్‌లో ఉన్నాయి. ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ, "పీఎంజే జువెల్స్ భీమవరం స్టోర్‌ను ప్రారంభించడం, వారి 8 రోజుల పెళ్లి, హాఫ్ శారీ ఆభరణాల ప్రదర్శనను ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆరు దశాబ్దాల వారసత్వంతో, పీఎంజే జువెల్స్ విశ్వాసం మరియు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ స్టోర్ వారి కళాత్మకత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది, ప్రతి ఆభరణాన్ని సాంస్కృతిక, భావోద్వేగ ప్రాముఖ్యత కలిగిన కళాఖండంగా మారుస్తుంది" అని పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా.. పేదలకు సామాజిక భద్రత

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ



పేద ప్రజల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ భరోసా ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, పేదరికం లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి .లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. విజయవాడ అర్బన్ 14వ వార్డు పుట్ట రోడ్ ప్రాంతంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను స్వయంగా కలిసి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియ గురించి అడిగి తెలుగుసుకున్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవకతవకలకు తావులేకుండా అత్యంత పారదర్శకత జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,29,874 మంది లబిద్దారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి రూ. 99 కోట్ల 27 లక్షల మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## ఏపీని ఈ రకంగా దెబ్బతీస్తుంటే ఎలా బాబూ?

-మొదటిపేజీ తరువాయి

దెబ్బతీస్తుంటే ఎలా? రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోతే మీకెందుకు ఆ పదవి? గతంలో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా కృష్ణాజలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. 1995లో ఆల్మట్టి ఎత్తు 509.016 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు నీటిని నిల్వ చేయడానికి అవసరమైన పనులు, స్పిల్‌వే సహా, గేట్ల నిర్మాణ పనులు జరుగుతుంటే అప్పట్లో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నా, మీ ఎంపీల బలంమీదే అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నా, 1995-2004వరకూ కేంద్రంలో చక్రం తిప్పినట్టుగా మీకుమీరే గొప్పలు చెప్పుకున్న కాలంలో, మీకున్న రాజకీయబలాన్ని రాష్ట్ర ప్రయోజనాలకోసం వాడలేదన్నది నిజమే కదా? సుప్రీంకోర్టు ఆదేశాలతో 519 మీటర్లకు పరిమితం అయినా, చివరకు మీ హయాంలోనే తాను కోరుకున్న స్థాయిలో ఆల్మట్టి స్పిల్‌వే సహా గేట్లు పెట్టేందుకు అవసరమైన పనులు కర్ణాటక ప్రభుత్వం పూర్తిచేసిందనేది వాస్తవం కాదా? గడచిన రెండున్నర దశాబ్దాలుగా, వర్షాభావం నెలకొన్న సంవత్సరాల్లో ఆల్మట్టి ఎత్తు పెంపు ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో కృష్ణాజలాలపై ఆధారపడ్డ ప్రాంతాలు ఎంతగా దెబ్బతింటున్నాయో, తాగునీరు లేక ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో మనం చూస్తూనే ఉన్నాం. ఇవన్నీ మీ వైఫల్యాల పుణ్యమే కదా చంద్రబాబుగారూ? ఇప్పుడు మళ్లీ, మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే, మళ్లీ ఆల్మట్టి లో 519 మీటర్ల నుంచి 524.256 మీటర్ల కు పెంచి నీటిని నిల్వ చేయడానికి కర్ణాటక ప్రభుత్వం అన్నిరకాలుగా సిద్ధమయ్యింది. నీటినిల్వ సామర్థ్యాన్ని 129.72 టీఎంసీల నుంచి ఏకంగా 279.72 టీఎంసీలకు పెంచాలని నిర్ణయం తీసుకోవడమే కాదు, దీనికోసం రానున్న 3 ఏళ్లలో రూ.70వేల కోట్లు ఖర్చు చేయాలని నిశ్చయించింది. ఇంత జరుగుతున్నా మీలో కదలిక కనిపించడంలేదు చంద్రబాబుగారూ? ..ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వంలో మీరు చక్రం తిప్పుతున్నారని మీరు, మీ ఎల్లోమీడియా రోజూ ప్రచారం చేసుకుంటున్నారు. పైగా మీ ఎంపీల బలంమీదే కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉందన్న మాటకూడా వాస్తవమే. మరి అలాంటప్పుడు మీకున్న రాజకీయ బలాన్ని ఉపయోగించి, ఒత్తిడి తెచ్చి తద్వారా పనుల నిలుపుదలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆదేశాలు ఎందుకు ఇప్పించలేకపోతున్నారు? కర్ణాటక మంత్రివర్గం సెప్టెంబరు 16న నిర్ణయం తీసుకుంటే ఇప్పటివరకూ మీరెందుకు స్పందించడంలేదు? అసలు రాష్ట్రం అంటే మీకు పట్టింపు ఉందా? లేదా? ..మరోవైపు జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన కృష్ణా జలవివాద ట్రైబ్యునల్ ముందు రాష్ట్రం తరఫున వినిపిస్తున్న వాదనలు అత్యంత బలహీనంగా ఉన్నాయి. కృష్ణా నదిలో 75% నీటిలభ్యత ఆధారంగా చేసిన తీర్పు అమల్లోకి వస్తే, రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతుంది. ఆ స్థాయిలో నీటి లభ్యత పరిగణలోకి తీసుకున్న పరిస్థితుల్లో, దాన్ని ప్రామాణికంగా తీసుకుని కేటాయింపులు చేయడం వల్ల రాష్ట్రానికి ఊహించని విధంగా నష్టం జరుగుతుంది. కరువు వస్తే రాష్ట్రమే భరించాలి, ఎలాగూ దిగువ రాష్ట్రం మనదే కాబట్టి వరద వచ్చినా రాష్ట్రమే ఆ నష్టాన్ని భరించేవిధంగా ప్రస్తుతం ఉన్న ప్రతికూల పరిస్థితులు మరింత తీవ్ర రూపం దాలుస్తాయి. దీన్ని గుర్తించి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 అక్టోబరులోనే పిటిషన్ దాఖలు చేసి, న్యాయపోరాటాన్ని ప్రారంభించింది. కాని మీరు ఇప్పుడు సమర్థవంతంగా వాదనలు వినిపించి, రాష్ట్ర హక్కులను కాపాడ్డంలో చిత్తశుద్ధి చూపడంలేదు. ..చంద్రబాబు మీరు ఇప్పటికైనా మేలుకోండి. కేంద్రంలో ఎంపీల సంఖ్యాపరంగా మీకున్న బలాన్ని ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి. ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోవడంతోపాటు, KWDT-2 విచారణపై దృష్టిపెట్టి, సమర్థవంతమైన వాదనలు వినిపించండి.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
గురువారం 2 అక్టోబర్ 2025



www.viswamvoice.com

# స్వర్గీయ జిఎంసి బాలయోగి గొప్ప మానవతావాది

**కోనసీమ అభివృద్ధి ప్రదాత మా బాలయోగి**

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** మాజీ లోక్ సభ స్పీకర్,స్వర్గీయ జి ఎం సి బాలయోగి గొప్ప మానవతా వాదని, ఆయన చేసిన సేవలు చిర స్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. జిఎం సి బాలయోగి 74వ జయంతి సందర్భంగా అమలాపురం లోని బాలయోగి ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమలాపురం ఎంపీ, బాలయోగి కుమారుడు హరీష్ మాధుర్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మాజీ లోక్ సభ స్పీకర్ స్వర్గీయ జి ఎం సి. బాలయోగి స్పీకర్ హోదాలో దేశానికి, ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు తనదైన స్థాయి లో సేవలు అందించారని కీర్తించారు. అయన 74వ జయంతి సందర్భంగా బాలయోగి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాలయోగి చేసిన అభివృద్ధి ఫలాలు ఇప్పటికీ మనం ఆస్వాదిస్తున్నాం అని అన్నారు. దళిత సామాజిక వర్గం నుండి లోక్ సభ స్పీకర్ పదవి చేపట్టిన మొట్ట మొదటి వ్యక్తి అని అది మనందరికీ ఎంతో గర్వకారణం అని కొనియాడారు. దిండి బ్రిడ్జి, యానాం బ్రిడ్జి మంజూరు ఆయన కృషితోనే జరిగిందన్నారు. అంతేకాక గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధురి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ప్రాజెక్టు సాధించి తీరుతామన్నారు. తన తండ్రి బాలయోగి ఆశయ సాధనకు, కోనసీమ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ లు పాల్గొని కోనసీమకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన బాలయోగి కృషిని స్మరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, బాలయోగి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ఫైర్ వర్క్స్ షాపును తనిఖీ చేసిన ఆర్డీవో



**కొత్తపేట విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, అదేశాల మేరకు, రెవిన్యూ డివిజినల్ అధికారి, కొత్తపేట సబ్ డివిజినల్ పోలీస్ అధికారి, కొత్తపేట సంయుక్తముగా స్థానిక మండలం, పలివెల గ్రామములో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఫైర్ వర్క్స్ వద్ద తనిఖిలను నిర్వహించి, మందుగుండు సామాగ్రి నిలువ అమ్మకాలకు సంబందించి ఉన్నటువంటి అనుమతులను నిర్వహణ లో తీసుకు న్న భద్రతా చర్యలను పరిశీలించారు కార్యక్రమములో, కొత్తపేట తహసిల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, రావులపాలెం, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కొత్తపేట, అగ్నిమాపక సిబ్బంది, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, పాల్గొని, సురక్షితమైన భద్రతా ప్రమాణాలు పాటించవలసినదిగా సూచనలు చేశారు, అలాగే మండల పరిధి లో గల అన్ని దీపావళి సామాగ్రి తయారీ, నిల్వ మరియు అమ్మకం చేసే వ్యాపారస్తులు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించవలసి యున్నదని లేని ఎడల సంబందిత అసాములపై చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని తెలియజేశారు .

## నూతన పింఛన్లు పంపిణీ చేసిన సత్తిబాబు రాజు.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలంలోని గోడి గ్రామంలో బుధవారం సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు మరియు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు , గోడి ఎంపీటీసీ కాండ్రేగుల వాణీ అచ్యుతం ఆద్వర్యం లో కొత్తగా మంజూరు అయిన వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది.అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన మెగా డీఎస్సీలో గోడి గ్రామానికి చెందిన కొనుకు ప్రమీల ఉద్యోగం సాధించడం జరిగింది. ఆమెను దుస్సాలువా తో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు మరియు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, గోడి ఎంపీటీసీ కాండ్రేగుల వాణీ అచ్యుతం, పంచాయతీ కార్యదర్శి నందిక శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లు పంపిణీ చేసిన ఆర్డీవో కే మాధవి



**అమలాపురం రూరల్ విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1:** ఎన్టీఆర్ భరోసా భద్రతా పింఛన్ల పంపిణీ ద్వారా పేద, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక భద్రతను కల్పిస్తూ జీవనోపాధిని మెరుగుపరచాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని కే మాధవి తెలిపారు బుధవారం స్థానిక ఈ డబ్ల్యూ ఎస్ కాలనీ 14 సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ప్రత్యేకించి దివ్యాంగులు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు మరియు సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన ఉన్న వ్యక్తు లకు నెలవారీ పింఛన్ ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవన భద్రతను కల్పిస్తోంద న్నారు.కీలకంగా పేద కుటుంబాలకు మద్దతు ఇవ్వడం, వారి జీవన భృతికి తోడ్పాటు అందించేలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోంద న్నారు. వృద్ధులు వికలాం గులు వితంతువుల అవ సరాల కోసం ఈ పింఛన్లు సహాయపడుతున్నాయ న్నారు.పింఛన్ భద్రత కల్పించ డంతోపాటు, సమాజంలోని బలహీన వర్గాలకు సామాజిక న్యా యం చేకూరుతుంద న్నారు.. ప్రజా సంక్షేమాన్ని మెరుగు పరిచే విధంగా, నిరుపేద లకు నిత్య జీవనాధారం ఏర్పడు తుందన్నారు. నెలవారీ పింఛన్ అందించడం ద్వారా, పింఛన్ దారులకు ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు సహాయం అందుతోంద న్నారు. ఆర్థికంగా బలహీన వర్గాల జీవితాల్లో స్థిరత్వం జీవన భద్రత చేకూరుతుం దన్నారు.సమాజంలో వెనుకబడిన వర్గాల వారికి సామాజిక జీవన భద్రతను కల్పించడం ఎన్టీఆర్ భరోసా భద్రత పింఛన్ల ప్రధాన ఉద్దే శమన్నారు. ఈ కార్యక్ర మంలో తాసిల్దారు అశోక్ కుమార్ సచివాలయ సి బ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# వృద్ధుల అనుభవాలు తదుపరి తరాలకు పాఠాలు

**రాయవరం సంజయ్ గాంధీ వృద్ధాశ్రమంలో ఘనంగా వృద్ధుల దినోత్సవ వేడుకలు**

**సన్మాన, సత్కారాలతో వృద్ధులను గౌరవించిన ప్రముఖులు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల సంజయ్ గాంధీ వృద్ధాశ్రమంలో డాక్టర్ సుందర్ రాజు ఆద్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆశ్రమం లోని వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చందమల్ల రామకృష్ణ, ఎంపిపి నౌడు వెంకటరమణ , టిడిపి సీనియర్ నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ముందు తరాలకు ఎంతో సేవ చేసిన వృద్ధులకు గౌరవించడం తమకు దొరికిన గొప్ప భాగ్యమని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంజయ్ గాంధీ వృద్ధాశ్రమం నిర్వాహకులు డాక్టర్ సుందర్ రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం వృద్ధుల హక్కులు, సంక్షేమం, ఆరోగ్య భద్రత, గూర్చి సమాజానికి అవగాహన కల్పించడమేనని అన్నారు. వృద్ధుల అనుభవం జ్ఞానం సమాజానికి మార్గదర్శకమని, వారు గతంలో చేసిన సేవలకు కృతజ్ఞతగా గౌరవం ఇవ్వడం అవసరమన్నారు. వృద్ధులకు ఆరోగ్య, సామాజిక భద్రత సదుపాయాలు అందిస్తూ, వారి సంక్షేమానికి పథకాలు, చట్టాలను బలోపేతం చేయాలని కోరారు. తదుపరి వృద్ధులకు సన్మాన, సత్కారాలు జరిగించి, అనంతరం కేక్ కటింగ్ చేసి, వారికి స్వీట్లు, పండ్లు అందించారు. తదుపరి వృద్ధులందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తాడి రామచంద్రారెడ్డి, సేవా సంస్థల ప్రతినిధి వెలగల ఫణికృష్ణారెడ్డి, పడాల కమలా రెడ్డి, ఆశ్రమం సిబ్బంది, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కాపవరం గ్రామంలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులు

**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 01:-** రామచంద్రపురం మండలం కాపవరం గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు 4 లక్షలు రూపాయలుతో పాటిమీద సీసీ డ్రైన్ కం రోడ్ పనులుకు ఎంపీటీసీ రెడ్నం సతీష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.సర్పంచ్ యనమదల మంగాదేవి కొబ్బరి కాయ కొట్టి పనిని మొదలు పెట్టించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ ఈ పనిని ఇచ్చిన మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీమతి కొల్లపు రాజేశ్వరి,వార్డు సభ్యుల దంగేటి లోవరాజు,మాజీ ఎంపీటీసీ గీసాల శతకోటి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ గీసాల సత్యనారాయణ, కోపరేటివ్ డైరెక్టర్ గుంటూరి లోవరాజు మరియు కూటమి నాయకులు గుంటూరి వరప్రసాద్ రావు,దంగేటి అవిశాజ్యోతి,పంతగడ సత్యనారాయణ,గీసాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



## బొడసకుర్రు లో బాలయోగి 74 వ జయంతి వేడుకలు:



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మాజీ లోక్ సభ స్పీకర్ జి ఎం సి బాలయోగి 74వ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి బాలయోగి ఎంతో కృషి చేసినారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి శ్రీ శాంతి భవాని, పాలకవర్గ సభ్యులు అడపా శ్రీను, మొయిల గణపతి, ముత్యాల బాబీ, రొక్కాల నాగేశ్వరరావు, అయిల వెంకట నాగేశ్వరరావు, అరవ చంటి, గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పంచాయతీ కార్యదర్శి బి. ఆదిశంకరం, దొమ్మేటి రాధాకృష్ణ, జల్లి రాధాకృష్ణ, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ,తదితరులు పాల్గొన్నారు.

## లూయిస్ అంధుల పాఠశాలను ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం పట్టణంలోని బూపయ్య అగ్రహారంలో నిర్మించిన లూయిస్ అంధుల పాఠశాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ లు ప్రారంభించారు. ఎంపీ లాడ్స్ నిధులు, సిఎస్ ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.60 లక్షల వ్యయంతో పంచాయ తీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో ఈ భవనం నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్ లు సంయుక్తంగా ప్రారంభో త్సవం నిర్వహించారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి వద్దకు ఎన్నోసార్లు అందుల పాఠశాలకు నిధులు కేటాయించమని అభ్యర్థించినా వైసీపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. లూయిస్ అంధుల పాఠశాల కళ్ళు లేని ఎంతోమంది జీవితాలకు వెలుగు ప్రసాదించి, వారి జీవితాలకు దారి చూపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాముఖ్యత నిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లాపవన్, జనసేన నాయకులు నల్లాశ్రీధర్ , డాక్టర్ మమత, పంచాయతీరాజ్ డిఈఇ అన్యం రాంబాబు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో మంత్రి సుభాష్



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 01:-**జీఎస్టీ సంస్క రణలు ద్వారా పేద, మధ్యతరగతి వారితోపాటు అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటం తో పాటు ఆదాయం రెట్టింపు అవ తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం రామచంద్రపురంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతుంది అన్నారు. నాలుగు స్లాబులుగా ఉండే జిఎస్టిని కేంద్రం రెండు స్లాబులుగా సంస్కరించింది అన్నారు. నిత్యావసర వస్తువులు,మందులపై జీరో శాతం జిఎస్టి అమల్లోకి తెచ్చిందన్నారు. రైతులకు మేలు చేసే పరికరాలపై 8 నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. సులభతరమైన జీఎస్టీ వ్యాపారులకు అమ్మకాల పెరుగుదల,వ్యవసాయ యంత్రాలపై ఉన్న 12 శాతం ఉన్న జీఎస్టీ ను 5 శాతానికి తగ్గించడం, ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ గిఫ్ట్ గా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్లో డబుల్ ఇంజన్ సర్కార్ డబల్ బెనిఫిట్స్ కల్పించిందన్నరు.చిరు వ్యాపారులకు, వ్యవసాయ,విద్యా రంగాలకు మేలు జరిగేలా జిఎస్టి తగ్గించారన్నారు. మనం తయారు చేసిన వస్తువులు మనమే కొనుక్కునే విధంగా ఉండాలని,దీని ద్వారా ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు 8 వేల కోట్లు మేర ప్రయోజనం చేకూరనుందని అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 వేల సమావేశాలు నిర్వహించి,1.60 కోట్ల కుటుంబాలను కలిసి జీఎస్టీ ప్రయోజనాలు వివరించేలా కార్యాచరణ ప్రభుత్వం రూపొందించింది అన్నారు.జిఎస్టి తగ్గింపు వల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, నియోజకవర్గం మండలాల అధ్యక్షులు ఉండవిల్లి శివ, కొత్తపల్లి శ్రీనుబాబు, మేడిశెట్టి రవికుమార్, చావ్వకుల నారాయణ మూర్తి,కూటమి నాయకులు గరికపాటి సూర్య నారాయణ, సలాది రమేష్, చందమామ వాసు,కవల నానాజీ,కంచుమర్తి బాబురావు,దంగేటి గౌరీ శంకర్,నారాపురెడ్డి బలరాం,శంకర్,పలివెల ప్రకాష్,మహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మి,వయిట్ల గజలక్ష్మి,విజయలక్ష్మి,పెద్ద ఎత్తున కూటమి పార్టీ నాయకులు,డీసీ లు, క్లస్టర్,బూత్ ఇన్చార్జిలు, వ్యాపారస్తులు,ప్రజలు పాల్గొన్నారు.

## బెంగళూరు ప్యాలెస్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



**విశ్వ వాయిస్ న్యూస్ రావులపాలెం** రావులపాలెంలో న్యూ భాస్కర రెస్టారెంట్ పక్కన విజయ సాయి ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బెంగళూరు ప్యాలెస్ ఎగ్జిబిషన్ ను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. వ్యాపారాభివృద్ధి జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కె వి సత్యనారాయణరెడ్డి,గుత్తుల రాంబాబు,కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## గాంధేయ భావజాలానికి ప్రతిరూపం

అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భం దేశ ప్రజలకు స్వాతంత్ర్య స్ఫూర్తిని, సత్యం–అహింస సిద్ధాంతాలను మాత్రమే కాదు, మానవతా దృక్పథాన్ని కూడా గుర్తు చేస్తుంది. అదే సందర్భంలో దేశవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించడం విశేషం. గాంధీజీ జీవితం జైలు అనుభవాలతో ముడిపడి ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ఎన్నో సార్లు నిర్బంధించ బడ్డారు. అయితే ఆయన దృష్టిలో జైలు శిక్ష కేవలం శిక్ష మాత్రమే కాదు, ఆత్మ పరిశీలనకు, నైతిక సవరింపులకు, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఒక పాఠశాల. ఖైదీల పట్ల ద్వేషం చూపకుండా మానవతా విలువలతో వ్యవహరించడం సమాజాన్ని ఆరోగ్యవంతం చేస్తుందని ఆయన నమ్మారు. ఈ ఆలోచనలే నేటి ఖైదీల సంక్షేమ దినోత్సవానికి మూల ప్రేరణ. ప్రస్తుతం భారత దేశంలో సెంట్రల్ జైళ్లు, జిల్లా జైళ్లు, సబ్ జైళ్లు, ప్రత్యేక నిర్బంధ కేంద్రాలు కలిపి 1,300 పైగా జైలు సంస్థలు ఉన్నాయి. 2023 నాటి జైలు గణాంకాల ప్రకారం దేశంలో 5,54,000 మందికి పైగా ఖైదీలు ఉన్నారు. వీరిలో సుమారు 77 శాతం మంది ఇంకా తీర్పు వెలువడని అండర్ ట్రయల్స్ వర్గానికి చెందినవారే. అంటే వారు నేరం రుజువు కాకముందే దీర్ఘకాల నిర్బంధంలో ఉండి పోతున్నారు. జైళ్ల సామర్థ్యం సుమారు 4.5 లక్షల వరకు మాత్రమే ఉన్నందున ఆక్రమణ రేటు 120 శాతానికి పైగా ఉంది. దీని వలన మౌలిక సౌకర్యాల లోపం, ఆరోగ్య సమస్యలు, ఆహార లోపాలు, మానసిక ఒత్తిడి వంటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఈ వాస్తవికతలో ఖైదీల సంక్షేమం, సవరింపులు, పునరావాసం మరింత అత్యవసరంగా మారాయి. అక్టోబర్ 2న జైళ్లలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఖైదీలకు ఆరోగ్య శిబిరాలు, కంటి పరీక్షలు, రక్తదాన కార్యక్రమాలు, మానసిక వైద్య సలహాలు అందిస్తారు. వృత్తి శిక్షణా కేంద్రాల్లో కొత్త కోర్సులు ప్రారంభించి, కొన్నిచోట్ల కంప్యూటర్ శిక్షణ, కుట్టు, చెక్కపని, ముద్రణల వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే శిక్షణ ఇస్తారు. ఖైదీలు సృజనాత్మకతను ప్రదర్శించే హస్తకళల ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఇవ్వడం వల్ల మానసిక ఉపశమనం లభిస్తుంది. కొన్నిచోట్ల ప్రత్యేక భోజన ఏర్పాట్లు, నూతన దుస్తులు పంపిణీ కూడా చేస్తారు. ఇవన్నీ ఖైదీల మనసుల్లో ఆశాజ్యోతి వెలిగించే ప్రయత్నాలుగా నిలుస్తాయి. జైలు వ్యవస్థలో ఉన్న ప్రధాన సమస్యలు అధిక జనసాంద్రత, తీర్పు ఆలస్యం, మానసిక ఆరోగ్య సేవల లోపం, సామాజిక అవమానం. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన %వీశీవశ్రీ ూతీఱంశీఅ మీఱఅబఱశ్రీ% (2016) ఒక మార్గదర్శకంగా ఉంది. ఇందులో ఖైదీల హక్కులు, మౌలిక సదుపాయాలు, పునరావాస విధానాలపై దృష్టి పెట్టబడింది. అయినప్పటికీ అమలు విషయంలో రాష్ట్రాల మధ్య తేడాలు కనిపిస్తున్నాయి. తిహార్ జైలు వంటి కొన్ని కేంద్రాలు పునరావాస కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నాయి. అక్కడ గాంధీయ అధ్యయన కేంద్రం, వృత్తి శిక్షణా విభాగాలు, పుస్తక పఠనశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. కొందరు ఖైదీలు అక్కడి నుంచి డిగ్రీలు, డిప్లొమాలు పూర్తి చేసి సమాజంలో తిరిగి స్థిరపడు తున్నారు. ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ పనిలో భాగస్వామ్యం అవుతూ ఖైదీల పునరావాసానికి తోడ్పడుతున్నాయి. ఖైదీల సంక్షేమ దినోత్సవం ఒక రోజుకు పరిమితమయ్యే ఉత్సవం కాదు. ఇది సమాజానికి గుర్తు చేసే నినాదంఖైదీ కూడా మానవుడే, అతనికి సవరించు కోవడానికి, తిరిగి సమాజంలో నిలబడడానికి హక్కు ఉంది. వేగవంతమైన న్యాయ సేవలు, చిన్న నేరాలకు సులభతరమైన బెయిల్ విధానం, మానసిక ఆరోగ్య సహాయం, వృత్తిపరమైన శిక్షణా అవకాశాలు, విడుదల అనంతరం ఉపాధి భరోసా ఇవన్నీ ఖైదీకి తిరిగి జీవనోపాధి కల్పించగల మార్గాలు. మహాత్మాగాంధీ చూపించిన సత్యం, అహింస, క్షమ అనే విలువలే ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆత్మ. శిక్ష అనేది ప్రతీకార పద్ధతి కాక పునరుద్ధరణ సాధనం కావాలి. జైలు ఒక శిక్షా స్థలమే కాదు, జీవన పాఠశాల కావాలి. ఖైదీ సమాజంలో తిరిగి సత్ప్రవర్తకుడిగా నిలబడేలా చేయడం ప్రభుత్వ, న్యాయ వ్యవస్థ, సమాజం అంతా కలసి భుజానికెత్తు కోవలసిన బాధ్యత. అక్టోబర్ 2న జరుపుకునే ఖైదీల సంక్షేమ దినోత్సవం ఈ మార్గంలో మానవత్వపు కాంతి దీపంలా నిలుస్తుంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# జీవవైవిధ్య పరిరక్షణలో వన్యప్రాణులు



పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్ధకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02 –08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" లేదా నేషనల్ వైల్డ్‌లైఫ్ వీక్" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ "డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్" అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్–లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

# ప్రతిభాశాలి సి.డి.దేశ్‌ముఖ్



సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 – అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు. భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌ముఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు.భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు వెర్రితలలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ తగ్గలేదు.ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. 1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరఫునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశంలో ఇతడు చైర్మెన్ గా వ్యవహరించారు.

1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు వేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినప్పుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరిం చారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు. దేశ్‌ముఖ్ సేవలను అంతర్జాతీయ ద్రవ్యనిధి వినియోగించు కోవాలని కోరినప్పుడు అందుకు ఆయన అంగీకరించ లేదు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఇన్ని ఉద్యోగాలు చేసిన ఆయన ఎల్లప్పుడూ నిర్ధనుడే. కూడబెట్టిన ధనమంతా పూణేలో ఉన్న ఇల్లు మాత్రమే. 1952లో దేశ్‌ముఖ్ విద్యనభ్యసించిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు జేసస్ కళాశాల నుంచి గౌరవ ఫెలోగా ఎన్నికైనారు. 1959లో ప్రభుత్వ సర్వీసు రంగంలో రామన్ మెగ్సేసే అవార్డును పిలిప్పీన్స్ కు చెందిన జోస్ అగ్విలార్ తో కల్సి సంయుక్తంగా పొందారు. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. 1982, అక్టోబరు 2న మరణించారు.

# చెడుపై మంచి విజయమే 'విజయదశమి'

హిందూ కాలపట్టిక ప్రకారం ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం పదవ రోజున ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం దసరా – విజయదశమి వేడుకలను అత్యంత ఉత్సాహభరితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుపోవడం జరుగుతున్నది. శ్రీరాముడు రాక్షస రావణుడిని సంహరించిన పవిత్ర రోజుగా మాత్రమే కాకుండా దుర్గాదేవి మహిషాసురుడిని వరించిన రోజుగా కూడా పర్వదినం జరుపుకోవడం కొనసాగుతున్నది. మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసిన దుర్గాదేవి పదవ రోజుల ఆ రాక్షసుడిని సంహరించడం జరిగిందనే విషయం మనకు తెలుసు. పాండవులు అజ్ఞాతవాసం పూర్తి చేసుకొని తిరిగి తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై నుంచి తీసి పూజలు చేసిన అనంతరం కౌరవులను ఓడించారని కూడా మనం శమీ పూజలు నిర్వహిస్తాం, జమ్మి ఆకును బంగారంగా భావించి మన ఆత్మీయులతో పంచుకుంటూ, అందరం క్షేమంగా, సురక్షితంగా ఉండాలని ప్రార్థనలు చేస్తాం. చేడుపై మంచి, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం విజయంగా విజయదశమి పర్వదినం నిలుస్తున్నది. మనం కూడా మన జీవిత లక్ష్యాలను సుసాధ్యం చేసుకోవడానికి మనలో ఉన్న బలహీనతలు లేదా చెడు అలవాట్లను త్యాగం చేసుకుంటూ బలాలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు సాగడానికి ఈ పర్వదినం ప్రేరణగా నిలుస్తున్నది. ఆయుధ పూజను చేసే ఆచారం మనలో జీవన సాఫల్య నైపుణ్యాలను పెంపొందించుకోవడాన్ని సూచిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో శరన్నవరాత్రి, తెలంగాణలో బతుకమ్మ పండుగలను శక్తి స్వరూపిణి ప్రతిరూపాలుగా పూజలుగా నిర్వహించుకుంటున్నాం. దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. మరునాడు వచ్చే మహర్నవమి అనంతరం వైభవంగా విజయదశమి వేడుకలు నిర్వహిస్తారు. శమీ పూజ, అపరాజిత పూజలను ఈ పవిత్ర దినాన నిర్వహిస్తారు. చెడుపై మంచి విజయంగా పదితలల రావణుడిని శ్రీరాముడు సంహరించిన రోజుగా రావణుడి దిష్టి బొమ్మను 'రావణ వధ' లేదా 'రావణ దహనం' కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతోంది. ఆ విధంగా తొమ్మిది రోజుల (నవరాత్రుల) పూజ అనంతరం పదవ రోజు విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటున్నాం. ఈ రోజున దేశవ్యాప్తంగా దుర్గ, సరస్వతి, లక్ష్మి, గణేశ్ విగ్రహాలను సమీప నదుల్లో లేదా జలాశయాల్లో నిమజ్జనం చేస్తారు. పూజించాల్సిన వాహనాలు, ఆయుధాలు, పని మెట్లను శుభ్ర పరుచుకోవడం, ఆయుధాలను ఎరుపు వస్త్రాల్లో ఉంచడం, పవిత్ర గంగా జలాలను చల్లి శుద్ధి చేయడం, పసుపు–కుంకుమ–గంధం పూల మాలలు సమర్పించడం, దీపం వెలిగించి ధూపం వేయడం, జమ్మి ఆకులతో పూజ చేయడం, అక్షింతలు–స్వీట్స్ సమర్పించడం లాంటి పవిత్ర ఆచారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుపోవడం

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
గురువారం 2 అక్టోబర్ 2025
www.viswamvoice.com



# బాలయోగి 74 వ జయంతి వేడుకలు

## బాలయోగి జీవితం ఒక స్ఫూర్తి గ్రంథం గంగుమళ్ళ

**అమలాపురం రూరల్ విశ్వంవాయస్ న్యూస్ అక్టోబర్ 1** అయినవిల్లి మండలం కె.జగన్నాధపురం గ్రామంలో మాజీ లోక్సభ స్పీకర్ స్వర్గీయ గంటి మోహనచంద్ర బాలయోగి 74వ జయంతి వేడుకలు బాలయోగి చారిటబుల్ సోసైటీ %-%1999 రాష్ట్ర కన్వీనర్ మరియు భారతీయ హ్యూమన్ కౌన్సిల్ జోనల్ హెడ్ రాయి రాంబాబు అధ్యక్షతన జరుగ గా ముఖ్య అతిథులుగా అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు(బాబి మాస్టర్)ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ మరియు జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లా శ్రీనివాసరావు,శ్రీ ఉమామహేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలయోగి శిలా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించగా,అనంతరం గ్రామంలోని వృద్ధులు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి సేవా భావానికి కొత్త ఊరట ఇచ్చారు.వ్యవస్థాపక అధ్యక్షులు గంగుమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ 2000 అక్టోబర్ 1న ఇదే రోజున మా స్వగృహంలో బాలయోగి పుట్టినరోజు వేడుకలు లోక్ సభ స్పీకర్ హోదాలో స్వయంగా కేక్ కట్ చేయించి ప్రజల మధ్య ఆప్యాయతతో గడిపిన అద్భుతమైన సంఘటనని నెమరు వేసుకుంటూ బాలయోగి చేసిన అభివృద్ధి పనులను కార్యక్రమంలో స్పష్టంగా గుర్తు చేశారు.ముఖ్యంగా జాతీయ రహదారి 214 (ప్రస్తుతం 216గా పునర్మార్గీకృతం)ప్రతిపాదించి సాధించడంలో ఆయన కీలకపాత్ర చేయడం,యానాం%-%ఎదుర్లంక వంతెన వంటి రవాణా ప్రాజెక్టులను రూపుదిద్దించడంలో చేసిన ఋణరహిత కృషి,ఎంపీ నిధుల ద్వారా పాఠశాలలు, రహదారులు మరియు అనేక ప్రజా సదుపాయాలకు నిధులు సమకూర్చడం,ప్రకృతి విపత్తుల సమయంలో బాధితుల పక్కన నిలబడి సహాయ శిబిరాలు నిర్వహించడం,ఓఎన్జిసి మరియు





గెయిల్ వంటి సంస్థల నుంచి ప్రాజెక్టు నిధులు రాబట్టే దూరదృష్టి చూపడం తదితర పనులు ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. అంతేకాదు ఆయన పేరు మీద హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్మించబడిన జిఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియం ఆయన సేవలకు శాశ్వత సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జిఎంసీ బాలయోగి గురుకుల పాఠశాలల పేరును తీసేయడం చాలా బాధాకరం అని బాలయోగి సేవలకు చక్కటి గుర్తింపు కావాలంటే ఈ కూటమి ప్రభుత్వం ఆయన పేరును ప్రతిష్టాత్మక కట్టడాలకు, ప్రభుత్వ పథకాలకు, విశ్వవిద్యాలయాలకు పెట్టే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలి అని కోరారు.వారి కుమారులు అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ బాలయోగి కోనసీమ రైలు మార్గం కోసం చేస్తున్న నిరంతర కృషిని ప్రత్యేకంగా అభినందిస్తూ త్వరలోనే మన కోనసీమలో రైలు కూత వినిపించబోతోంది అని వక్తలు ఆకాంక్షించారు.స్థానిక గ్రామ పెద్దలు, యువత మరియు ప్రజలు భావోద్వేగంతో మాట్లాడుతూ బాలయోగి జీవితం ఒక స్ఫూర్తి గ్రంథం అని ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించడం మనందరి కర్తవ్యమే అని నినదించారు.ఈ సేవా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు, సంఘ ప్రతినిధులు పాల్గొని బాలయోగి జ్ఞాపకాలను గౌరవంగా స్మరించి ఆయన సేవలను సజీవంగా నిలుపుకున్నారు.నివాళులర్పించిన వారిలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి బాలాజీ, హైస్కూల్ కమిటీ చైర్మన్ అంకం నాగ మల్లేశ్వర రావు, మండల బిజెపి అధ్యక్షులు యనమదల వెంకట రమణ,గ్రామ కమిటీ బుట్టే సత్తిబాబు, సామాజిక సేవకులు మల్లాది మల్లిబాబు మాస్టారు,యర్రంశెట్టి శ్రీను,పెనుమాల రాజు,గోలకోటి కృష్ణారావు,జనసేన నాయకులు నల్లా చిన్న,యర్రంశెట్టి కృష్ణ,యమ్.వివి,గాలిదేవర సతీష్ తదితరులు ఉన్నారు.

# జీఎస్టీ 2.0 ప్రయోజనాలు రైతాంగానికి విస్తృత అవగాహన కల్పించాలి

**అంబాజీపేట/జిల్లా ప్రతినిధి , విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1:** కేంద్రం ప్రకటించిన వస్తు సేవలు పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజ నాలు రైతులకు ట్రాక్టర్స్ విడిభా గాలు ,సూక్ష్మ పోషకాలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు వంటి బహుళ ప్రయోజ నాలపై రైతాంగానికి విస్తృత అవగాహన కల్పిం చాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యా లయం నందు నిర్వహించిన జిఎస్టి 2.0 ప్రయోజనాలపై రెండవ దశ ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గించారు. ఈ సందర్భంగా వ్యవ సాయ ఉద్యాన పశుసంవర్ధన మైక్రో డ్రిప్ ఇరిగేషన్ రంగాలలో తగ్గిన ఇన్పుట్స్ ధరల తో పాటు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను స్టాల్స్ ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గత నెల 22వ తేదీ నుండి జిఎస్టి ప్రయోజ నాలు అమల్లోకి వచ్చాయని తద్వారా ప్రతి కుటుంబం నెలకు సుమారు 6000 వరకు లబ్ధి పొందుతాయన్నారు జీఎస్టీ ప్రయోజ నాలపై ప్రజలలో విస్తృత అవగా హన కల్పి స్తూ ఆ యొక్క ఫలాలు లక్షిత వర్గాలవారు పొందేలా అధికా రులు వ్యాపార సంఘాలు ప్రచార కార్య క్రమాల ద్వారా పాటుపడాలన్నారు జిఎస్టి 2.0 సంస్కరణల ఫలాలను సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార అవగాహన కార్యక్రమాలు పక్కాగా నిర్వహించేలా దిశా నిర్దేశం చేశారు పెద్దపెద్ద వ్యాపార సముదాయాల నందు పాత రేట్లు తగ్గింపు రేట్లు బోర్డు ప్రదర్శించాయని మిగతా వారు కూడా ధరల పట్టీలను వ్యత్యా సాలతో ప్రదర్శించాలని ఆదేశించారు అంతిమ%శీ%గా ప్రజలకు జీఎస్టీ 2.0 ప్రయో జనాలను చేకూర్చాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు జీఎస్టీ సవర ణల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, మహిళలు, యువతకు ధరలు తగ్గడం ద్వారా గణనీయమైన సేవింగ్స్, ద్వారా కొనుగోలు శక్తి మెరుగు పడుతుందన్నారు,





గ్రామం పట్టణంలోసచివాలయం సిబ్బంది విస్తృత ప్రచారం చేపట్టారని ఇప్పటికే వచ్చిన ధర తగ్గింపు, రోజువారి వాడే వస్తువులు, ఇంటి ఖర్చులలో సేవింగ్స్ వివరించారు అన్నారు డిజిటల్, ప్రింట్ మీడియా ద్వారా ప్రచారం సెప్టెంబర్ 30%-% అక్టోబర్ 6 వరకు రైతు సేవా కేంద్రాలు, ట్రాక్టర్ షో, విడిభాగాలు సూక్ష్మ పోష కాలు ఎరువులు ద్వారా వ్యవసాయ రంగ ప్రయో జనాలు వివరించాలన్నారు. తదుపరి విద్య, సంబంధిత రంగాల్లో జిఎస్టి తగ్గింపు వల్ల కలిగిన ప్రయోజనాలు వివరించాలన్నారు. విద్యాసంస్థల్లో ఎస్సే, పెయిం టింగ్ పోటీలు, ద్వారా అవగాహ న కల్పించాలన్నా రు అక్టోబర్ 14-18: అభివృద్ధి, సంపద సృష్టిలో కొత్త జిఎస్టి వల్ల వచ్చిన లాభాలు ప్రజలకు వివరించా లన్నారు అక్టోబర్ 19: దీపావళి సందర్భం గా, జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉత్సవాలు, గణనీయ భాగ స్వామ్యం ద్వారా ముగిం పు. మండల, జిల్లా, గ్రామ స్థాయిలో నోడల్ అధికా రుల నియామకం. గ్రామ, వార్డు సెక్రటేరియట్ సిబ్బంది ద్వారా ప్రచారం బహిరంగ హోర్డింగ్స్, సోష ల్ మీడియా పోస్ట్లు, డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రచారం., వ్యాపార సంఘాలు, శాఖల సమన్వ యంతో తగ్గిన వస్తువులు, సేవల్లో ప్రజల సేవింగ్స్ ను వివరించాలన్నారు. ఎంఎస్ ఎం ఈ లు రైతులు, యువత, మహిళలు, వృద్ధులు, చిన్న వ్యాపారా లు మొదలైన అనేక వర్గాలకు ప్రయోజనాలు చేర్చడం ఈ పవిత్ర సమ యంలో గ్రామీణ, అన్ని ప్రాంతాల్లో సూప ర్ జీఎస్టీ సేవింగ్స్ ప్రచారం ద్వారా ప్రజలకు చేకూరే లబ్ధి, సేవింగ్స్ తదితర ప్రయోజనాలు పొందేలా పాటుపడాలన్నారు. ప్రాణాపాయం నుండి బయట పడే ఔషధాలపై పూర్తిగా జీఎస్టీకి మినహా యింపు ఇచ్చారన్నారు. కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ జిల్లా జీఎస్టీ 2.0 ప్రయోజనాలు కల్పన నోడల్ అధికారి సిహెచ్ రవికాంత్ ప్రచార కార్యక్ర మాలను అధికారులకు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి వివరిం చారు. వివిధ శాఖల పై రూపొందించిన ప్రచార కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు ఈ కార్యక్ర మంలో ఆర్డీవో పి శ్రీకర్, ఉద్యాన అధికారి బి వి రమణ వ్యవసాయ అధికారి బోసు బాబు ఎంపీడీవో మమత, తాసిల్దార్ చిన్నబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర్లు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## శ్రీమహిషాసుర మర్దిని అమ్మవారి పూలదండకు వేలంపాట.

**లక్షా 5 వేలకి పాట పాడిన ఆకుల లక్ష్మణరావు.**

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఉన్న శ్రీమహిషాసుర మర్దిని అమ్మవారి మెడలో పూల దండ వేసేందుకు వేలంపాట నిర్వహించారు కమిటీ సభ్యులు.అమలాపురం రవణం వీది లో ఉన్న శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి మెడలో పూల దండ వేసేందుకు ప్రతి ఏటా వేలంపాట నిర్వహిస్తున్నారు ఆలయ కమిటీ సభ్యులు.అమ్మవారి మెడలో వేసే మొదటి పూలదండ వేసేందుకు వేలంపాటలో లక్ష ఐదు వేల రూపాయలకు పూల దండ ను దక్కించుకున్న హైదారాబాద్ భక్తుడు ఆకుల లక్ష్మణరావు,హైదారాబాద్ లో వుంటున్న భక్తుడు ఆకుల లక్ష్మణరావు ఫోన్ లో వీడియో కాల్ ద్వారా వేలంపాటలో పాల్గొని అమ్మవారి మెడలో పూల దండ వేలంపాటలో దక్కించుకున్నారు. అయితే ఈసారి అమ్మవారి మెడలో పూలదండ వేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. గత కొన్ని సవత్సరాలుగా శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారి మెడలో పూలదండకు వేలంపాట నిర్వహిస్తున్నరు కమిటీ సభ్యులు. 12 సంవత్సరాల క్రితం 4 వేల రూపాయలు పలికిన పూలదండ ప్రతి ఏటా వేరుగుతూ ఈసారి లక్ష ఐదు వేల రూపాయలకు చేరింది. అమ్మవారి మెడలో పూల దండ వేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ఇక్కడ భక్తుల నమ్మకం.







## జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1:** ఈనెల రెండో తేదీ గురువారం విజయ దశమి పర్వదినాన్ని పురస్కరిం చుకొని జిల్లా ప్రజల జీవితాలలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం విజయ దుర్గా దేవి నింపాలని మనసారా కోరుకుంటున్నానని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అధర్మంపై ధర్మం గెలిచిన ఈ విజయ దశమి సందర్భంగా మీ కుటుంబాలకు సంతోషం, సమృద్ధి చేకూరాలని ఆశిస్తు న్నానన్నారు.ఈ పవిత్రమైన విజయదశమి సందర్భంగా మీకు భాగ్యాలు కలిగి, ఆశయాలు నెరవేరుతూ,విజయాలు తేవాలని ఆకాంక్షించారు.మీ ప్రతి ప్రయత్నంలో విజయం సాధించండ%శీ% ఈ శుభదినాన మీ జీవితంలో ప్రతి దశలోను విజయం, ఆనందం, ఆరోగ్యం మరియు శాంతి అలవడాలని కోరుకుంటూ మరొక్కసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్ ఐ సి, (ఎస్.డి.ఎమ్.) ను మర్యాద పూర్వకంగా కలసిన ఎల్ ఐ సి, ఎ ఓ ఐ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** నూతనంగా ఎన్నికైన రాజమండ్రి డివిజన్ ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎ ఓ ఐ) యూనియన్ కమిటీ బుధవారం (ఎస్ డి ఎమ్) సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం ఇవ్వడం జరిగినది అలాగే సౌత్ సెంట్రల్ జోన్ జనరల్ సెక్రెటరీ పిఎల్ నరసింహారావు స్టేట్ కమిటీ ప్రెసిడెంట్ కోటేశ్వరావు స్టేట్ కమిటీ జనరల్ సెక్రెటరీ రవి కిషోర్ ఆధ్వర్యంలో నూతనంగా డివిజన్ ప్రెసిడెంట్ గా వీరభద్ర బాధ్యతలు స్వీకరించారు అలాగే డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్ రావు, డివిజనల్ సేల్స్ మేనేజర్ శర్మ ని, కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో డివిజనల్ రెసిడెన్సి సెక్రెటరీ కె నాగిరెడ్డి జనరల్ సెక్రెటరీ బల్ల రమేష్ కోశాధికారి వెంకటేశ్వరరావు అమలాపురం ఏవోఐ యూనియన్ నాయకులు ఏ నాగేంద్ర కుమార్ కె శ్రీనివాసరావు కె వీరస్వామి ఎం దుర్గా శ్రీనివాస్ గౌడ్, వివిధ బ్రాంచ్ ల నుంచి వచ్చిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## సేవాపక్షోక్షవాలలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం

**నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా మండలంలో బిజెపి శ్రేణులు సేవలు**

**అక్టోబర్ 2 వరకూ సాగనున్న పక్షోక్షవాలు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురిష్కరించుకుని దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు చేపట్టిన పక్షోక్షవాలలో భాగంగా రాయవరం మండలం, వెంటూరు గ్రామంలో బిజెపి సీనియర్ నాయకులు చిరట్ల సుబ్బారావు నిర్వహణలో, కపిలేశ్వరపురం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో, ఉచిత నేత్ర వైద్య శిబిరం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లొల్ల గ్రామ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి జానకి రాంబాబు మాట్లాడుతూ దేశ ప్రదాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని, జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన శస్త్ర చికిత్సలను కూడా ఉచితంగా నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగ పరచుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. రాయవరం బిజెపి మండల అధ్యక్షులు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండపేట నియోజవర్గ బిజెపి కన్వీనర్ కోటిపల్లి సాయిరాం ప్రసాద్, చెల్లూరు వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ దేవల్ల వెంకట్రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి శ్రీదేవి, నరాల రాంబాబు, పిల్లి సత్యనారాయణ, ముత్యాల వీర్రాజు చౌదరి, చింతా తమ్మిరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బిజెపి కార్యకర్తలు, నరేంద్ర మోడీ అభిమానులు,వృద్ధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**అయినవిల్లి విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, కొత్తపేట ఆర్.డి.ఓ. తో కలిసి అయినవిల్లి మండలం, అయినవిల్లి లంక గ్రామంలోని తొగరాపాయ వంతెన వద్ద ఉన్న వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించారు. గోదావరి నదిలో వరద నీటి మట్టాలు పెరుగుతున్న దృష్ట్యా తక్షణం తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్, ఎంపిడిఓ, ఎఇఇ (ఇరిగేషన్) అయినవిల్లి రెవెన్యూ, వైద్య, పోలీసు, మరియు పంచాయతీ సిబ్బందితో మాట్లాడి, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయం అందించాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన రెస్క్యూ మరియు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.
అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## డీఎస్సీకి ఎంపిక కాబడిన అభ్యర్థులను సన్మానించిన ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు




**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 1** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డీఎస్సీ రిక్రూట్మెంట్లో ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి ఎంపిక కాబడిన అభ్యర్థులకు బుధవారం నాడు ప్రభుత్వ విప్ మరియు ముమ్మడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పట్టుదలతో 16,000 పైగా టీచర్స్ ను రిక్రూట్మెంట్ ఎంపిక చేసి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. బాధ్యత గల ఉపాధ్యాయ వృత్తి లోకి వచ్చినందుకు ఎంపిక కాబడిన ఉపాధ్యాయులను అభినందిస్తూ తమ పాఠాలతో విద్యార్థుల భవిష్యత్తు ను తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్‌బిసిఐ పుల్లారావును కలిసిన కౌన్సిలర్ మందపల్లి రవికుమార్...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** అమలాపురం ఎస్పీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐ గా పుల్లారావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండపేట నుంచి కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు.ఈ సందర్భంగా ఆయనను దుస్సాల్వాలు,పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దార్ల అబ్రహం, మందపల్లి సంజీవరావు, దార్ల పుల్లారావు,మడికి ఆనందరావు, తాతపూడి సురేష్, శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ రాజరాజేశ్వరి ఆలయానికి కంబాల లక్ష రూపాయలు విరాళం.

- అన్నదానానికి టన్ను బియ్యం.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు కోరుకొండ శ్రీ రాజ రాజేశ్వరి శరన్నవరాత్రి చాలు పురస్కరించుకొని ఆలయానికి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. బుధవారం కంబాల శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ రాజరాజేశ్వరి ఆలయానికి లక్ష రూపాయలు నగదును ఆలయ కమిటీసభ్యులు అందజేశారు. అదేవిధంగా ఐదవ తేదీ ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని, ఎనిమిదో తేదీ బుధవారం గొప్ప అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఆలయ కమిటీసభ్యులు కంబల శ్రీనివాసరావు దాతృత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టి తగ్గింపు ఆక్వా రైతులకు సీడు, మేతలు, రసాయనాలు కొనుగోలుపై రాయితీ

జిల్లా మత్స్యశాఖ అధికారి వి కృష్ణారావు



**కాకినాడ, విశ్వం వాయిస్:** కాకినాడ జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ వలన కలిగే లాభాలు గురించి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ కాకినాడ యందు ఆక్వా రైతులకు, సముద్రంలో చేపల వేట చేయి మత్స్యకారులకు, మత్స్య సహకార సంఘం నాయకులకు , కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో జిల్లా స్థాయి మెగా మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావు మాట్లాడుతూ జిఎస్టి తగ్గింపు వల్ల ఆక్వా రైతులకు సీడు, మేతలు, రసాయనాలు కొనుగోలుపై రాయితీ లభిస్తుందని, చేపలు చెరువుల ద్వారా పెంచే మత్స్యకారులకు ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని తద్వారా డొమెస్టిక్ మార్కెట్ పెరుగుటకు చాలా అవకాశం కలుగుతుందని దీనివల్ల ఎగుమతులపై ఆధారపడుట తగ్గుతుందని తెలిపారు. కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి మాట్లాడుతూ జిఎస్టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు అందరికీ అందుతాయని అలాగే ఎక్కడైనా షాపు యజమానులు జీఎస్టీ తగ్గింపు అమలు చేయకపోతే కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ కు చెందిన క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి అందు తమ పిటీషన్ దాఖలు చేయవచ్చని ఇది చాలా సులువైన పద్ధతి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి వలన వలలు, వైరు రోపులు, మోటార్లు మొదలు వాటిపై రేట్లు తగ్గుతాయి. కనుక సముద్రంలో వేట చేయు మత్స్యకారులకు చెరువుల్లో వేట చేయు మత్స్యకారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ వారు ప్రతి కొనుగోలుపై రసీదు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలకు నిత్యవసర సరుకులు మీద, మందుల మీద, ఏసీ, ఫ్రిజ్లు, సెల్ఫోన్ మీద రేట్లు తగ్గుట వలన ఖర్చు తగ్గుతుందని తద్వారా అందరికీ ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమము లో జిఎస్టి తగ్గింపు మత్స్యశాఖకు చెందిన పోస్టరు విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు, మత్స్యకారులు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. మత్స్య శాఖ సహాయ సంచాలకులు శ్రావణి, కరుణాకర్ రావు, లావణ్య మరియు మత్స్య అభివృద్ధి అధికారి నూకరాజు, ఉమామహేశ్వరరావు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి-తిరుపతి మధ్య నూతన విమాన సర్వీసు ప్రారంభం.

న్యూఢిల్లీ నుండి వర్చువల్ గా ప్రారంభించిన కింజారపు. బిమాధురిపూడిలో తొలి సర్వీస్ ప్రారంభించిన కందుల.



కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్: రాజమండ్రి- తిరుపతి మధ్య నూతన విమాన సర్వీసును ఢిల్లీ నుంచి కేంద్ర పౌర విమానయానశాఖమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు,రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి వర్చువల్ గా ప్రారంభించారు. బుధవారం మధుపూడి విమానాశ్రయం నుండి అలయన్స్ ఎయిర్ సంస్థ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు(మంగళ,గురు,శని వారాలు) రాజమండ్రి నుండి తిరుపతి మధ్య ఈ విమాన సర్వీసులు నడవనున్నాయనీ కింజారపు తెలిపారు. ఉదయం 7:40 నిమిషాలకు తిరుపతిలో బయలుదేరి 9.25 గంటలకు రాజమండ్రి వస్తుందని,ఉదయం9.50 నిమిషాలకు రాజమండ్రిలో బయలు దేరి ఉదయం 11.20 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు.ఢిల్లీ నుంచి వర్చువల్ గా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎయిర్పోర్ట్ నుంచి రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,రాజమండ్రి రూరల్ శాసనసభ్యు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బల రామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నీరుకొండ వీరన్న చౌదరి, బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు మధురపూడి విమానాశ్రయంలో జండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు . ఈ సందర్భంగా కింజరాపు రామ్మోహన్ నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ"నవరాత్రుల సందర్భంగా రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభించడం ఆనందంగా ఉంద న్నారు. ఇది రాజమండ్రి వాసులకు విజయదశమి కానుక అన్నారు. ఢిల్లీ,ముంబైకి విమాన సర్వీసులు గతంలోనే ప్రారంభించడం జరిగిందని, అవి దేశంలోనే అత్యధిక డిమాండ్ ఉన్న ఎయిర్ సర్వీసులుగా నిలిచాయన్నారు. ఉభయ గోదావరిజిల్లా వాసులందరికీ సాంస్కృతిక రాజధాని రాజమండ్రి నుండి ఆధ్యాత్మిక రాజధాని తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభించడం ఒక కానుకగా అభివర్ణించారు.రాజమండ్రి నుంచి తిరుపతి వరకు నడిచే విమాన సర్వీసులో మూడు నెలలపాటు మొదటి 35 సీట్లు 1,999 రూపాయలు,తర్వాత 35 సీట్లు నాలుగువేల రూపాయలకే అందించడం జరుగుతుందన్నారు. రాజమండ్రి ఎయిర్పోర్టులో 2వ టెర్మినల్ కూడా నూతనంగా నిర్మిస్తున్నామని,పనులు చురుగ్గా సాగుతున్నాయని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాజమండ్రి నుంచి షిరిడి, గోవా, అహ్మదాబాద్, వారణాసి, ఇతర ప్రాంతాలకు కూడా ఎయిర్ సర్వీసులు ప్రారంభించాలని ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో వాటిని కూడా ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. బెంగళూరుకు ఇప్పటికే ఒక ఎయిర్ సర్వీసు నడుస్తోందనీ,అదనంగా వేరొక సర్వీస్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నమన్నారు.గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమండ్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతికశాఖమంత్రి కందుల మాట్లాడుతూ"రాజమండ్రి నుంచి తిరుపతి"కి విమాన సర్వీసు రాజమండ్రి ప్రాంత వాసుల చిరకాల స్వప్న మన్నారు. ఏ దేశమైనా,రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంట రోడ్డు, రైలు కనెక్టివిటీ చాలా ముఖ్యం అందులోనూ ఎయిర్ కనెక్టివిటీ మరింత ముఖ్యమన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లా వాసులు దుబాయ్ వంటి గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారని, రానున్న రోజుల్లో అంతర్జాతీయ సర్వీస్లకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఎయిర్పోర్ట్ డైరెక్టర్ పలువురు ప్రజాప్రతినిధులకు పూలమాలవేసి సాల్వాల్తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ఎయిర్పోర్ట్ సిబ్బంది, ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో వస్తు, సేవల పన్ను తగ్గింపు ఉభయతారకం





సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారం ప్రారంభం
కత్తిపూడిలో తొలి ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో వస్తు, సేవల పన్నులు (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ - జీఎస్టీ)ని తగ్గిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 2017 నుంచి ఇప్పటి వరకూ ఉన్న 4 జీఎస్టీ శ్లాబుల్లోని రెండింటిని రద్దు చేసి, మిగతా రెండు శ్లాబులకే జీఎస్టీని పరిమితం చేసింది. రెండు శ్లాబులను ఎత్తేయడం, కొన్ని వస్తువులపై ట్యాక్స్ తగ్గించడం వల్ల దేశ ప్రజలకు భారీగా ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. ఈ నేపథ్యంలో ఆ ప్రయోజనాలను, ఆర్థిక మిగులును ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రచారం చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ప్రచార కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని మంత్రివర్గ ఉప సంఘం సభ్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 19వ తేదీ వరకు 65 వేల ప్రచార సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సందర్భంగా కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, ఫలితాలు ప్రతీ వర్గానికి, ప్రతీ ప్రాంతానికి, ప్రతీ ఇంటికి చేరేలా థీమ్‌ల వారీగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని తీర్మానించారు. పర్యాటకం, ఆక్వా, విద్య, వ్యవసాయం, వైద్య రంగాల్లో ఈ జీఎస్టీ మార్పులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు వెల్లడించారు. ప్రతీ జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు నిర్వహించడం ద్వారా జీఎస్టీ తగ్గింపు లాభాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి వివరించారు. జీఎస్టీ తగ్గింపు సంబరాల్లో విద్యార్థులను కూడా భాగస్వామ్యంగా చేయాలని చంద్రబాబు సూచించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తొలి ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. స్థానిక ఎస్.ఎల్. ఎలక్ట్రానిక్స్ విద్యుత్తు ఉపకరణాల దుకాణంలో వస్తు, సేవల వినియోగదార్లు, స్థానిక వర్తక సంఘాల సభ్యులతో సమావేశ మయ్యారు. జీఎస్టీ శ్లాబు తగ్గింపు ప్రచార కరపత్రాల పంపిణీని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ జిఎస్టి 2.0 నూతన స్లాబ్ పన్ను తగ్గింపు విధానపు ఉపయోగాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. దేశంలో వస్తు, సేవల పన్ను తగ్గింపు ఇటు వినియోగదారులకు, విక్రేతలకూ ఉభయతారకమని అన్నారు. ఇప్పటి వరకు దేశంలో అమల్లో ఉన్న 28% వస్తు సేవల పన్ను కాస్తా నూతన స్లాబ్ విధానం ద్వారా 18 శాతానికి, 18 శాతంగా ఉన్న వస్తు సేవల పన్ను కూడా 5 శాతానికి తగ్గుతుందని ఆమె తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు రూ. 15,000 మేరకు వస్తు, సేవల పన్ను భారం తగ్గుతుంది అన్నారు. జిఎస్టి తగ్గింపుతో ధరలు తగ్గుతాయని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, వస్తు, సేవల అమ్మకాలు పెరిగి వినియోగదారుకి, వ్యాపారికి లాభదాయకంగా ఉంటుంది అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే హర్షం వ్యక్తం చేశారని, ఎమ్మెల్యేగా తన సంతృప్తిని ప్రకటించారు. ప్రతి ఒక్క కార్యకర్త కూడా జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాల సమాచార కరపత్రాలను పంచుతూ జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని ప్రతి ఇంటికీ వివరించాలని ఆమె పిలుపును ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను ప్రత్తిపాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ లాంఛనంగా పంపిణీ చేశారు. కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

## కూటమి నాయకుల చేతుల మీదుగా పెన్షన్ అందజేత

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గంటా రామలక్ష్మి కి వితంతు పెన్షన్ రాక చాలా ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కూటమి నాయకుల చేతుల మీదుగా పెన్షన్ అందజేయడం జరిగింది.

## గాడాల ఘటనలో నలుగురు ముద్దాయిలు గుర్తింపు.

డీఎస్పీ శ్రీకాంత్.
అసత్య ప్రసారాలు చేస్తే సహించేది లేదు.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** మధురపూడికి చెందిన పాముల శ్రీనుని మంగళవారం రాత్రి గాడాల వద్ద కొందరు యువకులు కొట్టడంతో ఇరువర్గాల ఘర్షణ వాతావరణం నెలకొందని ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ తెలిపారు. బుధవారం విమానాశ్రయం వద్ద ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గాడాల ఘటనపై జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు తాను దర్యాప్తు చేస్తున్నానన్నారు. దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు. ఈ ఘటనలో ప్రస్తుతం నలుగురు గుర్తించామని, మిగిలిన వారికోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు, మర్డర్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసును తప్పు త్రోవ పట్టించడానికి అసత్య ప్రసారాలు చేస్తే సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. బాధితుడ్ని వెంటనే వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించమన్నారు. గాడాలలో పరిస్థితి అదుపులోనే ఉందని, ఈ ఘటనను ఎవరన్నా ప్రేరేపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్, ఎస్సై నాగార్జున పాల్గొన్నారు.

## టిడిపి నాయకులకు విజయదశమి శుభాకాంక్షలు


కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధితో సుభిక్షంగా ఉన్న ప్రజలు
దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్ష..
హుమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** టిడిపి నాయకులకు హుమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల చైర్పర్సన్ డాక్టర్ ఖండవల్లిలక్ష్మి శు భాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ,రాజమండ్రి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి , రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, తదితర కూటమి నాయకులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి సందర్భంగా దుర్గాదేవి ఆశీస్సులు ప్రతీ కుటుంభానికి కలగాలని ఆనందం,ప్రేమ వెల్లివిరియాలని, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.కూటమి ప్రభుత్వం లో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలని ఆమె ఆకాంక్షించారు.


## టిడిపి నాయకులకు విజయదశమి శుభాకాంక్షలు

కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధితో సుభిక్షంగా ఉన్న ప్రజలు
దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్ష..
హుమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** టిడిపి నాయకులకు హుమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల చైర్పర్సన్ డాక్టర్ ఖండవల్లిలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ,రాజమండ్రి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి , రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, తదితర కూటమి నాయకులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి సందర్భంగా దుర్గాదేవి ఆశీస్సులు ప్రతీ కుటుంభానికి కలగాలని ఆనందం,ప్రేమ వెల్లివిరియాలని, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.కూటమి ప్రభుత్వం లో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలని ఆమె ఆకాంక్షించారు.

## ఆరోగ్యం, స్వచ్ఛత మనందరి బాధ్యత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ





**సీతానగరం విశ్వం వాయిస్** న్యూస్:రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్టత్మాకంగా చేపట్టిన కార్యక్రమం స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమం లో భాగంగా నేడు సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో స్వచ్ఛత హి సేవ పారిశుధ్య కార్మికులకు సన్మానం కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు వారు చేస్తున్న సేవలకు గాను అభినందన సత్కార సభ ఏర్పాటు చేసి వారిని ఘనంగా సత్కరించి వారికి కానుకగా యూనిఫామ్, బట్టలు అందజేసి వారికి అవసరమైన డెటాల్, చేతికి గ్లోవ్స్, మాస్క్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం , బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వి ఆర్ ఏ కుటుంబానికి సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల పరామర్శ



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన సనమంద్ర యేసు రత్నం(79) ఇటీవల కాలంలో అనారోగ్య కారణంగా మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు బుధవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి అండగా నిలబడతానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి నందమూరి చిట్టి స్వామి పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాజప్ప జన్మదిన వేడుకలు



**కాకినాడ, విశ్వంవాయిస్ :** పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప జన్మదిన వేడుకలు బుధవారం సామర్లకోట రోడ్డులో ఉన్న జెడ్ బ్రిడ్జి దగ్గర రాజప్ప అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నక్కా రాజశేఖర్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మృదుస్వభావి తొలినాళ్ల నుండి టీడీపీలో ఎంతో క్రమశిక్షణ గల నాయకుడిగా రాజప్ప పేరు తెచ్చుకున్నారన్నారు. అందువల్ల ఆయనకు వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికడమే కాక ఎంతో మంచితనంగా ఉన్నారన్నారు. రాజప్ప మాదిరిగానే ఇతరులు అతనిని ఆదర్శంగా తీసుకుని గుర్తింపు తెచ్చుకోవాలని రాజశేఖర్ అభిలాషించారు. కార్యకర్తలతో కలిసిపోయి వారి బాగోగులు పట్టించుకోవడం వల్లనే ఆయనకు పెద్దాపురం నియోజక ప్రజలు మూడుసార్లు వరుసగా పట్టం కట్టారని రాజశేఖర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజప్ప అభిమానులు సున్నంబట్టి రాము, కె శ్రీనివాసరాజు, జి అనుదీప్ కృష్ణ, ఎన్ అవినాష్, పోలీస్ శ్రీను, హనుమంతు రాజు, చౌదరి, బంగారు రాజు, దివాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ హాజరైన వారందరికీ కేకులు పంచి రాజప్పకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మెగా డీఎస్సీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అభినందన సభ

## నూతన అభ్యర్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి - ఎమ్మెల్యే ముప్పిడి

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** మెగా డీఎస్సీ తో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.బుధవారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. మెగా డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు నిబద్ధత తో పని చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి కృషి




చేయాలని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో నూతన సంస్కరణలు తీసుకురావడం జరుగుతుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చి దిద్దడం జరుగుతుందని తెలిపారు. నూతన అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ద్వి సభ్య కమిటీ సభ్యులు కంట మని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, టిడిపి సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్, కొవ్వూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దాయన రామకృష్ణ, టిడిపి నాయకులు బేతిన నారాయణ, జనసేన మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి, కొవ్వూరు మండల బిజెపి అధ్యక్షురాలు దేగల సునీత , టిడిపి నాయకులు కాకర్ల సత్యేంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు, గెల్లా సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఆర్కె హై స్కూల్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** చదువులమ్మ ఒడిలో అక్షరాలను దిద్ది, ఉపాధ్యాయుల క్రమశిక్షణతో విజ్ఞానాన్ని పొంది, ఉన్నత స్థాయిని చేరిన, చిన్ననాటి జ్ఞాపకాలను, గుర్తు చేసుకుని ఆనాటి స్నేహితులను ఆత్మీయంగా కలుసుకొని, విద్య నేర్పిన గురువులను సత్కరించుకోవడం మరపురాని జ్ఞాపకం అని సర్వేపల్లి రాధాకృష్ణ హై స్కూల్ పూర్వపు విద్యార్థులు పేర్కొన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని పరిమి రామారాయుడు మినీ ఫంక్షన్ హాల్ నందు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ హై స్కూల్ 1999 -2000 సంవత్సర పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం,, సిల్వర్ జూబ్లీ గెట్ టుగెదర్ సెలబ్రేషన్ నిర్వహించారు. స్నేహితులందరూ ఒకచోట కలిసి చదువు నేర్పిన గురువులను సత్కరించుకుని ఆనాటి జ్ఞాపకాలను




నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్వేపల్లి రాధాకృష్ణ హై స్కూల్ డైరెక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ చిన్ననాటి నుండి అల్లరి చిల్లరిగా తిరుగుతూ ఆటపాటలతో కాలాన్ని గడుపుతూ విద్య పట్ల శ్రద్ధతో విజ్ఞానాన్ని సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆ విద్యార్థిని చూసినప్పుడు ఆ గురువుకు కలిగే ఆనందం మరపురాని జ్ఞాపకం అన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి, సామాజిక విలువలను అర్థం చేసుకొని, సమాజానికి సహాయం అందిస్తూ, భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు, విద్యాసంస్థను వీడి 25 సంవత్సరాలు అయినా పాఠశాలను విద్య నేర్పిన గురువులను స్నేహితులను కలుసుకోవడం మధురమైన జ్ఞాపకమని అన్నారు. పూర్వపు విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. పూర్వపు విద్యార్థులు అనంతరం గురువులను సత్కరించుకున్నారు.

## ఘనంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భావ దినోత్సవం..



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భావ దినోత్సవం బుధవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు కొవ్వూరు పట్టణ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షులను ఘనంగా సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా మన్యం వీరభద్ర మాట్లాడుతూ సమాజ సేవలో తనదైన ప్రత్యేకతను కల్పించడంలో వాసవి క్లబ్ ముందుంటుందని, అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నామని పూర్వపు అధ్యక్షులను సత్కరించుకోవడం ఎంత సంతోషిదాయకమన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ వాసవి క్లబ్ కార్యదర్శి, సత్య వరపు గుర్నాథ్, పూర్వపు అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ కొల్లిపర శ్రీనివాస్ కాకి అనిల్ సూర్య వలివేటి ప్రసాద్, నాగవరపు మహేష్ కంకటాల రాంబాబు కేశ సురేష్ దేవతూ కృష్ణ ప్రసాద్ కక్కిరాల వీరభద్రరావు, వంకాయల శివరామకృష్ణ, నాగవరపు మహేష్ తదితర వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## తక్షణమే బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి.


- రోడ్డు బాగోక వాహనదారు లు తీవ్ర ఇబ్బందులు
- ఏపీ ఆదివాసీ జేఏసీ.



**రంపచోడవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ముసునిగుంట నుండి నరసాపురం గ్రామం వరకు రోడ్డు మొత్తం రాళ్లు లేసిపోయి,బూడిద గుట్టలు చదరకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని ఏపీ ఆదివాసీ జే.ఏ.సీ రాష్ట్ర వైస్ చైర్మన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం,దేవారం గ్రామపంచాయతీ పరిధిలోని ముసునిగుంట గ్రామం నుండి రంపచోడవరం మండలం నరసాపురం గ్రామం వరకు ప్రభుత్వాలు మారుతున్న, అధికారులు మారుతున్న ఈ రోడ్డుకి నేటికీ మోక్షం కలగలేదు అన్నారు.ఈ రోడ్డునే కాకుండా ఏజెన్సీ మారుమూల గ్రామాలన్నిటి కీ తక్షణమే బీ.టీ రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.


# గ్రామానికి సేవచేసిన వృద్ధుల గౌరవించాలి.

**పుష్కరమాత వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవం..**




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:**ల డాక్టర్ సుందర్ రాజు రాజమహేంద్రవరం రూరల్ స్థానిక వేమగిరిలో పెద్దలు డాక్టర్ సుందర్ రాజు నేతృత్వంలో పుష్కర మాత వృద్ధాశ్రమంలో బుధవారం ఉదయం ప్రపంచ వృద్ధుల దినోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి పుష్కర మాత వృద్ధాశ్రమం డైరెక్టర్ డాక్టర్ సుందర్ రాజు,డివెన్ ఐ ఫౌండేషన్ వేమగిరి సూపర్నెంట్ గంగరాజు, వేమగిరి పంచాయతీ అసిస్టెంట్ ఆఫీసర్ జ్యోతి,గ్రామ పెద్ద సేలం కోటి,ఏ ఎస్ ఐ వేమగిరి మధు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అందరికీ ప్రపంచవృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు.గ్రామ పెద్దలు గ్రామానికి ఎంతో సేవ చేసిన వృద్ధులకు గౌరవించబడ తానికి నేటి దినం మంచి సమయం అని తెలియజేస్తూ పుష్కర మాత వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు సన్మానం చేసి సత్కరించుట జరిగింది. వృద్ధుల హక్కులు సంక్షేమం ఆరోగ్య భద్రత గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడం ఈ సంవత్సరం యొక్క అంశం 2025 వృద్ధుల అనుభవం జ్ఞానం సమాజానికి మార్గదర్శకం వారు గతంలో చేసిన సేవలకు కృతజ్ఞతగా గౌరవం ఇవ్వడం వృద్ధుల కోసం ఆరోగ్య సదుపాయాలు సామాజిక భద్రత పథకాలు చట్టాలను బలోపేతం చేయడం జరిగిందని అన్నారు. అనంతరం కేకు కటింగ్ చేసి, స్వీట్స్, పండ్లు, భోజనం ప్లేట్లు అందించారు. వృద్ధులందరికీ విందు చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో పుష్కర్ మాత వృద్ధుల ఆశ్రయం సిబ్బంది పాల్గొన్నారు.

# కోనసీమకు వన్నెతెచ్చిన బాలయోగి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** కోనసీమ వాసి జిఎంసి బాలయోగి లోకసభ స్పీకర్ గా దేశ అత్యున్నత స్థానానికి ఎదిగి కోనసీమ ప్రాంతానికి వన్నె తీసుకొచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ఎంతో పాటు పడ్డారు.ఆయన అందించిన సేవలు మరువలేనివి ఆయన చేసిన అభివృద్ధి ఆయన అందించిన సేవలుతో కోనసీమ వాసుల గుండెల్లో శిరస్థాయిగా నిలిచారు.సామాన్య కుటుంబంలో పుట్టిన జీఎంసీ బాలయోగి దేశ రాజకీయాలలో చెరగని ముద్ర వేశారు. తనకంటూ ఒక స్థాయిని గౌరవాన్ని పెంచుకోగలిగారు.తద్వారా ఈ ప్రాంత ప్రతిష్టను ఇనుముడింపజేశారు.కోనసీమ ప్రాంతంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లిన బాలయోగి చేసిన అభివృద్ధి పనులు పలకరిస్తాయి. ఆయన ఏకైక కుమారుడు హరీష్ మాధుర్ ఎంపీగా తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి తండ్రి బాటలో పయనిస్తూ కోనసీమ వాసుల చిరకాల కోరిక రైల్వే లైన్ సాధనకు అవిశ్రాంత కృషి చేస్తున్నారు.ఢిల్లీ పీఠంపై అత్యున్నత పదవులలో బాలయోగి కొనసాగినప్పటికీ ఈ ప్రాంత వాసులకు ఎప్పుడు అందుబాటులోనే ఉండేవారు. అందరితో సన్నిహితంగా గడిపేవారు.పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలలో నాయకులను పెద్ద స్థాయి నుండి చిన్న స్థాయి వరకు పేరు పెట్టి మరీ పిలిచేవారు. అంతలా అందరికీ ఆయనతో మంచి అభినావ సంబంధాలు ఏర్పడ్డాయి.అంతటి మహా మనిషి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుని అమలాపురంలోని బాలయోగి ఘాటు వద్ద కొత్తపేట మండల టిడిపి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్ రెడ్డి, తాతాజీ , గుబ్బల మూర్తి, అడ్వకేట్ శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.


## వడ్డీల పేటలో పలు సమస్యలపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం వడ్డీల పేటలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక కూటమి నాయకుల ద్వారా రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలుసుకొని వడ్డీల పేటలో పర్యటించి గ్రామదేవత చింతాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించి అనంతరం గ్రామంలో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ముఖ్యంగా రోడ్లు,డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు వంటి పలు సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తుల కోరిక మేరకు త్వరలోనే ఒక కమ్యూనిటీ హాలు,స్మశాన వాటిక వద్ద షెడ్డు నిర్మాణం చేయిస్తామని తెలియజేశారు. అదే పేటకు చెందిన ఒక మహిళ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని తక్షణమే వైద్య ఖర్చుల నిమిత్తం రూ 5000/ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ సీనియర్ నాయకుడు ఏ.పి.ఆర్. చౌదరి తండ్రి అడపా సుబ్రహ్మణ్యం కన్నుమూత

**పలువురు నాయకులు పరామర్శ**



సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: కొటికేశవరం గ్రామంలో నివాసముంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు ఏ.పి.ఆర్. చౌదరి తండ్రి అడపా సుబ్రహ్మణ్యం మరణించారు. ఈ విషాద సమయంలో కోటికేశవరం లోని వారి స్వగృహానికి పలువురు రాజకీయ నాయకులు చేరుకొని నివాళు లర్పించారు.సిపిఐ(ఎంఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు, అడపా శ్రీనివాస్, జనసేన, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## భవిష్యత్‌కు వెలుగునిచ్చే చిన్నారి ప్రతిభ. వూర అభిజయ్




**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్న వయసులోనే ప్రతిభను ప్రదర్శించడం అరుదైన విషయం. కానీ ఆ ప్రతిభను దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చూపించడం నిజంగా గర్వకారణం. అలాంటి అసాధారణ ప్రతిభను కనబరిచిన సీతానగరం గ్రామానికి చెందిన చిన్నారి వూర అభిజయ్.కేవలం 4 సంవత్సరాల 8 నెలల వయసులోనే 197 దేశాల జెండాలను కేవలం 3 నిమిషాలు 10 సెకన్లలో గుర్తించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ ప్రతిభకు గాను ఆయనకు సెప్టెంబర్ 27 వ తేదీన చెన్నైలో జరిగిన అవార్డు కార్యక్రమం నందు కలామ్స్ వరల్డ్ రికార్డు లభించగా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కూడా అచీవర్ అవార్డును అందించింది.ఇంత చిన్న వయసులోనే ఇలాంటి విజయం సాధించడం, చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంత ముఖ్యమో చాటుతోంది. వూర అభిజయ్ సాధన ఇతర పిల్లలకు కూడా స్ఫూర్తిదాయకం కానుంది. చిన్న వయసులోనే విశేష ప్రతిభ %-% వూర అభిజయ్‌కు కలామ్స్ వరల్డ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభను కనబరచిన అభిజయ్‌ను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## పురుషోత్తపట్నంలో సి ఎం ఆర్ ఎఫ్ చెక్కును అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన ఓలేటి లక్ష్మి ప్రవీణకు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన రూ2,50,000/వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వైసిపి పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం జన్మదిన వేడుకలు..



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు పట్టణ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం పుట్టినరోజు వేడుకలను కొవ్వూరు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆయన స్వగృహం నందు తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ మాజీ అధ్యక్షులు తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసిన కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల ఆనందోత్సవాల మధ్య చిట్టూరి అన్నవరం కేకును కట్ చేసి అందరికీ అందించారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు గండ్రోతు సురేంద్ర,తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా ఏడుకొండలు,తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, నాయకులు దాసరి కృష్ణ, మసా ఆనంద్, బి.వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు

# మా గ్రామానికి శాశ్వత స్మశానవాటిక స్థలం పరిష్కారం చూపండి

ఆర్డీఓ,ఎమ్మార్వో లకు వినతిపత్రం ఇచ్చిన అంబికపల్లి అగ్రహారం గ్రామ ప్రజలు

రెండు గ్రామాలు పెద్దలతో సమావేశం నిర్వహిస్తాం

సమస్య పరిష్కారం కోసం ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్తాం

రెవిన్యూ,పోలీస్ సిబ్బంది





**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ అక్టోబర్ 01** :-రామచంద్రాపురం మండలం యనమదల గ్రామపంచాయతీ అంబికాపల్లి అగ్రహారంలో సుమారు 1000 మంది జనాభా ఉన్న గ్రామం.అయితే ఈ గ్రామంలో ప్రధాన సమస్య ఏమిటంటే,దహన సంస్కారాల కోసం దాదాపు 100 సంవత్సరాలుగా పొరుగున ఉన్న చోడవరం గ్రామానికి చెందిన దహన సంస్కారాల స్థలాన్ని ఉపయోగిస్తున్నాము.ఇది మా పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది.కాని 2012లో, ఒక వ్యక్తి చనిపోయిన తరువాత ఏదవిధిగా ఆ శ్మశానవాటికకు ఖననం చేయడానికి తీసుకెళ్లినప్పుడు, చోడవరం గ్రామానికి చెందిన ఎస్సీ,ఎస్టీ కులాలకు చెందిన కొంతమంది వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు.వెంటనే అప్పుడు పెద్దలు సమక్షంలో ఈ సమస్యను పరిష్కరించుకొని కార్యక్రమం పూర్తి చేసుకున్నాం.తరువాత రాజమండ్రిలో వున్న ఆర్డీఓ కార్యాలయం దృష్టికి ఈ సమస్యను గ్రామ పెద్దలుతీసుకొని వెళ్లగా, అప్పటి ఆర్డీఓ వెంటనే స్పందించి అంబికాపల్లి అగ్రహారం గ్రామానికి దహన సంస్కారాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించే వరకు చోడవరం గ్రామానికి చెందిన శ్మశానవాటికను ఉపయోగించుకోవడానికి అనుమతించాలని అప్పటి రామచంద్రపురం తహశీల్దార్‌ను ఆదేశించారు.వెంటనే రామచంద్రపురం తహసీల్దార్ ఆధ్వర్యంలో నాటి నుండి నేటి వరకు చోడవరం గ్రామ శ్మశానవాటికలో క్రమం తప్పకుండా దహన సంస్కారాలు చెయ్యడం జరిగింది. అయితే చోడవరం గ్రామంలో ఓసి, బీసీ కులాలకు ఒక శ్మశానవాటిక ఉండగా, ఒక్క ఎస్సి,ఎస్టీ కులాలకు శ్మశానవాటిక దాదాపు 3.50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.వాస్తవానికి చోడవరం గ్రామానికి చెందినది అయినా అ గ్రామాలకు చెందిన పూర్వీకులు రెండు గ్రామాల ప్రజలు ఎటువంటి శత్రుత్వం లేకుండా సోదరుల వలె కలిసి జీవించారు.కాని ఇప్పుడు కారణాలు ఏదయిన ప్పటికీ చోడవరం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తి మళ్ళీ అంభిక పల్లి అగ్రహారం గ్రామ ప్రజల్లో ఎవరైనా శనిపోతే మమ్మల్ని దహన సంస్కారాలు చేయకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారు.అయితే అక్టోబర్ 30న అంభిక పల్లి అగ్రహారం గ్రామానికి చెందిన కుమారుడు కోటి సుబ్బారావు అనే వ్యక్తి మరణించిగా ఎప్పటిలాగే దహన సంస్కారాల నిమిత్తం వెళ్లిన వెంటనే చోడవరం గ్రామస్తులు అడ్డుకున్నారు.ఈ విషయంపై రెండు గ్రామలు మధ్య వాదన రాగా అంభికపల్లి అగ్రహారం గ్రామ ప్రజలు గ్రామ నడిబొడ్డున మెయిన్ రోడ్డు లో నిరసన తెలియజేస్తూ ధర్నా నిరహించారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం పోలీస్ డివిజన్ అధికారి ఆదేశాలు మేరకు రామచంద్రపురం సిఐ పర్యవేక్షణలో ఎస్ఐ సమక్షంలో ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ రెండు గ్రామాలు మధ్య శాంతి చేసి ప్రస్తుతం దహన కార్యక్రమాలకు ఆటంకం లేకుండా చేశారు. అయితే మళ్ళీ మళ్ళీ ఈ సమస్య రాకుండా ఉండాలని అంభికపల్లి అగ్రహారం గ్రామ ప్రజలు మంగళవారం నాడు ఆర్డీఓ అఖిల,ఎమ్మార్వోలకు స్మశానవాటిక స్థలం వివాదాలు రాకుండా సొంత స్థలం ప్రభుత్వం తరువున అధికారులు మాకు అందజేసే వరకు చోడవరం గ్రామానికి చెందిన స్మశానంలో దహన కార్యక్రమాలు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు.అలానే స్థానిక పోలీస్ అధికారులు అయిన సిఐ,ఎస్ఐ కలిసి సమస్యపై వెంటనే స్పందించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే రెవిన్యూ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది అగ్రహారం గ్రామ ప్రజల సమస్యను ఉన్నత అధికారులుకు తెలియజేసి సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు.అప్పటి వరకు రెండు గ్రామాల మధ్య వివాదాలుకు తావు లేకుండా రెండు గ్రామ పెద్దలుతో సమావేశం నిర్వహించి దహన కార్యక్రమాలుకు ఆటంకం లేకుండా చేస్తామని తెలిపారు.

# వృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది

**బాలయోగి లాంటి నాయకుడు మరి రారు....**



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** సీఆర్సీ లో జరిగిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం, జీఎంసీ బాలయోగి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.. వృద్ధులను గౌరవించడం, వారిని జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత నేటి తరంపై ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం రావులపాలెం సీఆర్సీ లో జరిగిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం, దివంగత జీఎంసి బాలయోగి జయంతి వేడుకల్లో ఆయన కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, తదితరులతో కలసి పాల్గొన్నారు. వృద్ధులందరికీ అన్నదానం, వస్త్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్సీ వృద్ధుల ఆశ్రమం ఏర్పాటులో అప్పటి శాసనసభ్యునిగా ఉన్న తాను, లోక్ సభ స్పీకర్ గా ఉన్న బాలయోగి అండదండలు అందించామని, రెండున్నర దశాబ్దాలుగా ఈ వృద్ధుల ఆశ్రమం ఎందరో వృద్ధులకు ఆశ్రయం ఇవ్వడం ఎంతో సంతోషాన్ని అందిస్తుందని వ్యాఖ్యానించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వారిని అభిమానించి, ఆదరించి, ఆప్యాయతతో యోగ క్షేమాలను చూసి గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. కోనసీమ ముద్దుబిడ్డ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా ఆయన దేశానికి,ఈ ప్రాంతానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. దశాబ్దంన్నర రాజకీయ జీవితంలోనే ఆయన ఎన్నో అమూల్యమైన సేవలు కోనసీమకు అందించారన్నారు. కోనసీమలో ఏ మూలకు వెళ్ళినా బాలయోగి చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. జాతీయ రహదారి కొత్తపేట నియోజకవర్గం మీదుగా వెళ్లడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అప్పట్లో జాతీయ రహదారి రూట్ మ్యాప్ మారిందని ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని చూసి తాను ఆ అంశాన్ని అప్పటి స్పీకర్ గా ఉన్న బాలయోగి దృష్టికి తీసుకు వెళ్లగానే ఆయన హుటాహుటిన స్పందించి మన ప్రాంతం నుంచే జాతీయ రహదారి నిర్మాణం చేసేలా చూశారన్నారు. దానితో జొన్నాడ వద్ద గౌతమీ నదిపై, గోపాలపురం వద్ద వశిష్ట నదిపై రెండు వారధులు వచ్చి నేడు ఈ ప్రాంతానికి తలమానికంగా నిలిచాయన్నారు. చరిత్రలో బాలయోగి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కె వి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్,తోట స్వామి,చిన్న కె వి,చిన్నం శ్రీనివాసరెడ్డి,కొవ్వూరి అచ్చిరెడ్డి మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాబు ష్యూరిటీ - జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేశాం

- అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ నిర్వహించాం
- విద్యార్థులకు టీచర్లు నైతిక విలువలు బోధించాలి
- ఉపాధ్యాయులూ ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతుండాలి.
- ఇక ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుంది
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఎన్నికల్లో హామీ ఇస్తూ -బాబు ష్యూరిటీ - జాబు గ్యారెంటీ అని ఇచ్చిన హామీ మేరకు దాన్ని నిజం చేయడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించి నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయు లుగా నియమితుల్కెన 58 మంది ఉపాధ్యాయులను బుధవారం ఆయన ఎస్‌కెవీటీ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో కలుసుకుని అభినందించారు. వారందరికీ ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబుతో కలిసి ఆయన జ్ఞాపికగా పార్కర్ పెన్నులను అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్పైనే పెట్టారని గుర్తు చేశారు. అవినీతి లేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. పదిహేనేళ్లలో 14 సార్లు డీఎస్సీని పెట్టడం జరిగిందని, 1,96,619 ఉద్యోగాలిచ్చామని, ఇకపైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుందన్నారు. ఈ విషయంలో నిరుద్యోగులు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. పేదరికంలేని సమాజం చూడాలనేది తమ కూటమి లక్ష్యంమని, పేదరికంలేని సమాజాన్ని చూడాలంటే అది విద్యతోనే సాధ్యమన్నారు. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరని, ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారని, అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మహిళలకు కోసం తమ కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, దీపం పథకం అమలు చేస్తున్నామని, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా.. వారందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయడం జరిగిందని సూపర్ సిక్స్ సూపర్ హిట్టయ్యిందన్నారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తీసుకురావడం వల్ల ధరలు తగ్గాయన్నారు. కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకోవడం ద్వారా 10 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతికి విమాన సర్వీసు అభినందనీయం..

చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హర్షం

రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీసు ప్రారంభం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ మోహన్ నాయుడు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం నుండి ఆధ్యాత్మిక రాజధాని తిరుపతికి అలయెన్స్ విమాన సర్వీసు బుధవారం ఉదయం మధురపూడి విమానాశ్రయంలో ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు , రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ తిరుపతికి విమాన సర్వీసులు ఎంతో ఉపయోగకరమని హర్షం వ్యక్తం చేశారు. ఈ సౌకర్యాన్ని చాలా వేగంగా తీసుకు వచ్చిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుకు, సీఎం చంద్రబాబుకు,ఎంపీ పురందేశ్వరికి ఆయన అభినందనలు తెలిపారు.

## అభాగ్యులకు ఆర్థిక భరోసా "ఎన్టీఆర్ భరోసా" - ఎమ్మెల్యే ఆదిరెడ్డిశ్రీనివాస్



రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్: అభాగ్యులకు ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం అండగా నిలుస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 47వ డివిజన్‌లో బుధవారం ఉదయం ఆయన అర్హులకు 'ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు ఆర్థిక భద్రత ఇవ్వడమే తమ కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛను ద్వారా వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులకు సహకారం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి భరోసా, సురక్షితత కల్పించడం తమ బాధ్యతన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 1000 పెంచి పెన్షన్లు ఇచ్చిన ఘతన తమ కూటమికే దక్కుతుందన్నారు. అంతే కానీ వైకాపా వారిలా ఒక చెప్పి మరోటి చేయలేదన్నారు. అలాగే ప్రజలకు ఆరోగ్యం విషయంలో కూడా తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పేద ప్రజలు ఎవరైనా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే అందుకు అయిన ఖర్చును సిఎంఆర్ఎఫ్ ద్వారా వారికి ఇవ్వడం జరుగుతోందన్నారు. తమ సూపర్ సిక్స్... సూపర్ హిట్ అయ్యిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లోని దాదాపుగా అన్నీ అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు సేవ చేయడం తప్పితే... వారి నమ్మకాన్ని వమ్ము చేయడం తమకు రాదన్నారు. ప్రజా సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 5న కోనసీమలో కాట్వా ఉపకార వేతనాల పంపిణీ...



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాట్వ) ఆధ్వర్యంలో అక్టోబర్ 5న అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరగనుందని కాట్వ జిల్లా అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు పప్పుల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుందని ఆయన చెప్పారు. జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ స్వగృహం లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 1000 మంది విద్యార్థులకు, రూ.70 లక్షల వరకు ఆర్థిక సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు ఈ కార్యక్రమానికి 30 లక్షల విరాళం ప్రకటించారని హైదరాబాద్ ఆలివ్ స్వీట్స్ అధినేత దొర రాజు ఎస్ ఎస్ సి %-%2025లో కోనసీమ జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఒక లక్ష నగదు బహుమతి అందజేయనున్నారన్నారు. నిధుల సమీకరణలో సహకరించిన అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీతో పాటు దాతలు తాడి నరసింహారావు, బండి గుప్తా పాండురంగారావు, బోనం కనకయ్య, గంధం పళ్ళంరాజు, త్సవటపల్లి నాగబాబు, జయన సత్తిరాజు, అంబాజీపేటకు చెందిన నాగిరెడ్డి శివప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి కి దశావతార ఘట్టం భజనలతో నీరాజనం



**విశ్వం వాయిస్ న్యూస్ కొత్తపేట** : కొత్తపేట మండలం బొరుసు వారి సావరంలో వేంచేసి ఉన్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఈరోజు నవరాత్రుల్లో ఎనిమిదవ రోజు అమ్మవారి సన్నిధిలో దేవస్థాన చైర్మన్ బొరుసు ఉదయభాస్కర్ వసుధ ల ఆధ్వర్యంలో దశావతార ఘట్టం అయినవిల్లి మండలం నేదునూరు గ్రామం జోగి శ్రీనివాస్ గురువు భజన బృందం అంగరంగ వైభవంగా దశావతార ఘట్టం భజన చేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి లక్ష్మణ శర్మ మరియు కొప్పిశెట్టిప్రభాకర్ కుడుపూడి సూర్యప్రకాష్ కుడిపూడి రాంబాబు బొక్క శ్రీను శీలం అజయ్ కుమార్ మరియు భక్తులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారని తెలియజేశారు.

## కోనసీమ అభివృద్ధి ప్రదాత జీఎంసీ బాలయోగి సేవలు అజరామరం....



**విశ్వం వాయిస్ న్యూస్ కొత్తపేట** బాలయోగి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన లోక్ సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన కోనసీమ ముద్దుబిడ్డగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కీర్తించారు. బుధవారం స్వర్గీయ జీఎంసీ బాలయోగి 74వ జయంతి సందర్భంగా కొత్తపేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘన నివాళులు అర్పించారు. బాలయోగితో తనకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కోనసీమ ఉన్నంతవరకు ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు అజరామరంగా నిలుస్తాయని కొనియాడారు. దళిత,బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహోన్నత వ్యక్తి బాలయోగి అని కొనియాడారు. రాష్ట్రానికి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితమవుదామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలు కు దసరా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్ పి రాహుల్ మీనా



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు, పోలీసులు మరియు వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చెడుపై మంచి విజయమే విజయదశమి. దసరా పండుగ సాంప్రదాయ, ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీక. ఇది ధర్మవంతమైన జీవనం, న్యాయం, సామరస్యం మరియు శాంతి పట్ల మన అవగాహనను పెంపొందిస్తుంది. పండుగలో కుటుంబసఖ్యతను గౌరవించడం, సాంప్రదాయాలను పాటించడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడం వంటి విలువలు గుర్తుకు వస్తాయని ఎస్పీ తెలిపారు. అలాగే, దసరా అనేది ఆరోగ్యం, సుఖసంతోషం, విజయాలు ప్రగతి కోసం ప్రార్థించే సందర్భమని, ప్రతి ఒక్కరు ఈ పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరు సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.

## లైసెన్స్ లేకుండా మందు గుండు సామాగ్రి కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్ పి రాహుల్ మీనా

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** దసరా, దీపావళి పండుగల సందర్భంగా లైసెన్స్ లేకుండా ఏ విధమైన మందుగుండు సామాగ్రి కలిగి ఉండడం, నివాస గృహాల మధ్యన దాచిపెట్టడం, అమ్మట చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్టం ప్రకారం తీసుకుని చర్యలకు బాధ్యులగుదురని జిల్లా ఎస్పీ తెలియపరిచినారు. అమలాపురం, ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మందుగుండు సామాగ్రి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వారి వద్ద నుండి అధిక మొత్తంలో మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. దసరా, దీపావళి పండుగలను ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, అనవసరమైన ఆర్భాటాలకు పోయి ప్రమాదాల బారిన పడకూడదని ఎస్పీ జిల్లా ప్రజలకు సూచించడం జరిగినది.

# స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌కు వైద్యులు డుమ్మా?

**27 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మెలో ప్రభుత్వ వైద్యులు**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యకరమైన మహిళలు – బలమైన కుటుంబాల కోసం ఆరోగ్య శిబిరాలు" అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా అతివలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు నిర్వహించిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' పథకం వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి, వైద్య సేవలను అందించాల్సిన వైద్యులే ఈ శిబిరాలకు డుమ్మా కొట్టిన వైనమిది. సెప్టెంబర్ 17 ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన ఈ కావడంతో ఆ రోజు నుంచి అక్టోబరు 2 వరకు గ్రామ స్థాయి నుంచి నగరాల వరకు అన్ని చోట్లా ఈ వైద్య శిబిరాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. "ఇంటింటా స్త్రీల సంపూర్ణ ఆరోగ్యమే దేశ సౌభాగ్యం" అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన ఈ వైద్య శిబిరాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రతి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, హెచ్.డబ్ల్యు.సి. ఆరోగ్య మందిరాల్లో దేశ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో 75,000 ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని కేంద్రం సంకల్పించింది. ఈ ప్రత్యేక వైద్య శిబిరాల్లో మహిళలు అందరికీ అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం (షుగర్), ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, రక్త, బీపీ, షుగర్, టిబి పరీక్షలు, బాలింతలు, గర్భిణీలకు పరీక్షలు, అలానే క్యాన్సర్ స్క్రీనింగ్, యుక్త వయసు కౌమార బాలికలకు రక్త పరీక్షలు, గిరిజనులకు



సికెల్ సెల్, అనీమియా, క్షయ తదితర పరీక్షలను వైద్య నిపుణులతో చేయించి వైద్యం అందించి ఐరన్, కాల్సియం తదితర మందులను ఇస్తారని ప్రచారం చేశారు. ఐతే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని శంఖవరం, కత్తిపూడి, అన్నవరం, మండపం, నెల్లిపూడి గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. 27 న పెదమల్లాపురం, శాంతి ఆశ్రమం ప్రభుత్వ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నెల్లిపూడిలోనూ, శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శంఖవరం సచివాలయం 2 లో బుధవారం నిర్వహించిన ఈ వైద్య శిబిరాలకు వైద్యులే కరువు అయ్యారు. నెల్లిపూడి వైద్య శిబిరానికి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి వైద్యులు ఒక్కరి చేతుల మీదుగానే మొత్తం వైద్య శిబిరం నడిచింది. దీనికి శాంతి ఆశ్రమం, పెదమల్లాపురం ఆస్పత్రుల వైద్యులు హాజరు కాలేదు. అలాగే శంఖవరం సచివాలయం 2 వైద్య శిబిరానికి శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శెట్టిబత్తుల



శ్రీరామ రాజీవ్ కుమార్, మోహన్ సాయిరెడ్డి వైద్యులు హాజరు అయినప్పటికీ ప్రారంభం తర్వాత వెళ్ళిపోయారు. వైద్య శిబిరం అంతా ఎం.ఎల్.హెచ్.పీల చేతుల మీదుగానే జరిగింది. సెప్టెంబర్ 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు సమ్మెలో ఉన్నందున వారు ఈ వైద్య శిబిరాలకు హాజరు కాలేదు. ఐతే ఈ సమ్మె పరిస్థితి గురించి ప్రభుత్వానికి ముందే తెలిసినప్పటికీ సమ్మె వైద్యులకు బదులుగా ప్రత్యామ్నాయంగా ఇతర వైద్యులను ప్రభుత్వం కేటాయించ లేకపోయింది. ఎంతో ప్రతిష్టాత్మకమని ఢంకా బజాయించుకుని ప్రచారం చేసుకున్న ప్రభుత్వాలకు ఆచరణలోకి వచ్చేసరికి చిత్తశుద్ధి లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం ఆశించిన ప్రజా ప్రయోజనం అంతగా నెరవేర లేదు. ప్రజలు కోరుకున్న వైద్య సేవలు వారికి పూర్తి స్థాయిలో అందలేదు.

# రాయవరం ఎమ్మార్వో ఐపీ శెట్టి పదవీ విరమణ

**ప్రశాంతతకు మరో పేరు గా ఐపి శెట్టి పనితీరు.. సుదీర్ఘ ఉద్యోగ, బాధ్యతలలో అవినీతి ఆరోపణలు లేని అధికారి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో కలెక్టరేట్ నుండి 64 మండలాల ల్యాండ్ అక్రిడేషన్ నిర్వహణ**

**సుదీర్ఘ చరిత్ర కలిగిన రెవెన్యూ శాఖ లో ఎనలేని సేవలు.. ఐపి శెట్టి అభినందన సభలో మండపేట తహాశీల్దార్ తేజేశ్వరరావు ప్రశంసలు**







**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండల తహాశీల్దార్ ఐపి శెట్టి పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంను డిప్యూటీ తహాశీల్దార్ భాస్కర్ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాయవరం తహాశీల్దారు కార్యాలయం లో ఐపి శెట్టి తన ఆఖరి పని దినం విధులలో ఉండగా, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల ఎమ్మార్వో ను ఆయన కార్యాలయం లోనే కలిసి శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాయవరం లోని పంక్షన్ హాల్ లో సహెూద్యోగులు, రేషన్ డీలర్లు సంయుక్తంగా ఐపి శెట్టి దంపతులకు అభినందన సభ కార్యక్రమ ఏర్పాట్లను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలు మండలాల తహాశీల్దార్లు హాజరై ఎమ్మార్వో గా ఐపి శెట్టి కనుపరిచిన పనితీరును కొనియాడారు. ఈ సందర్భంగా తొలుత డిప్యూటీ తహాశీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల లోనైనా ప్రశాంతంగా పనిచేయడం ఐపి శెట్టి ప్రత్యేకత అని కొనియాడారు. అనంతరం మండపేట తహాశీల్దార్ పి.తేజేశ్వర రావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో పని చేసిన ఐపి శెట్టి అనుభవం ఎనలేనిదని, ప్రజలకు కంటికి కలెక్టర్ మాత్రమే కనబడితే ఆయన వెనుక కంటికి కనబడని అంతరేంద్రియాలుగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేస్తారని తెలిపారు. అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ దీర్ఘకాలిక సేవలను ప్రజలకు అందిస్తుందని, అట్టి శాఖలో లాండ్ అక్రిడేషన్ వంటి కష్టతరమైన పనులను ఐపి శెట్టి సులువుగా చేసేవారిని కొనియాడారు. ఉమ్మడి







తూర్పుగోదావరి జిల్లాలో 64 మండలాలకు సంబంధించిన లాండ్ అక్రిడేషన్లను పూర్తి చేసారని, ఉన్నత అధికారులు సైతం ఐపి శెట్టి సేవలను పొగుడుతుంటే తమకు ఈర్ష్య కలిగేలా ఆయన పనిచేస్తారని వివరించి, ఆయనతో పోటీ పడాలని ప్రయత్నించే వారమని గుర్తు చేశారు. 62 సంవత్సరాల వయసు లోనూ 42 సంవత్సరాల వ్యక్తిలా కనిపించే ఐపి శెట్టి భావి జీవితం సుఖమయం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మార్వో ఐపి శెట్టి దంపతులను శాలువా, గజ పూలమాలలతో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ,ఐపి శెట్టి తన పదవీ కాలంలో నీతి, నిజాయితీ తో పనిచేశారని,ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారని పలువురు అభినందించారు. సుధీర్ఘ సంవత్సరాల ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఐపి శెట్టి ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా పదవీ విరమణకు చేరారని తరువాత జీవితాన్ని ఆరోగ్యంగా కుటుంబంతో సంతోషంగా గడపాలని పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు,రేషన్ డీలర్లు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఐపి శెట్టి మాట్లాడుతూ తన జీవితం లో ఎదురైన పలు సందర్భాలను జ్ఞప్తి కి తెచ్చుకున్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన సహెూద్యోగులు,సహచరులకు ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రయాణంలో వెన్నంటి నడిచిన తన అర్ధాంగి శ్రీమతి భారతి కి,తన కుటుంబానికి,బాల్యం స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ నౌడు వెంకట రమణ, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు మండలాల తహాశీల్దార్లు , రాయవరం మండలం లోని పలు గ్రామాలకు చెందిన విఆర్వోలు, విఆర్ఎలు, కార్యాలయ సిబ్బంది, మండలంలోని రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.






## దేవీనవ రాత్రులులలో ఆధ్యాత్మికంగా వెలుగొందుతున్న నడకుదురు గ్రామం

**మహిషాసుర మర్దిని అవతారం లో కనకదుర్గ అమ్మవారి దర్శనం!**


**గణపతి నగర్ కొత్త దిబ్బలు వారి వీధి నుంచి అంగరంగ వైభవంగా సారె సమర్పణ....**



**కాకినాడ రూరల్, కరప: విశ్వం వాయిస్ న్యూస్** కరప మండలం నడకుదురు గ్రామంలో శరన్నవరాత్రి మహెూత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా, బుధవారం నాడు గణపతి నగర్ కొత్త దిబ్బలు వారి వీధి నుంచి కనకదుర్గ అమ్మవారి ఆలయానికి సారె సమర్పణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేదీప్యమానంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు నడకుదురుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కోలాహలంగా, అమ్మవారి నామస్మరణలతో మారుమోగింది. వెలమ సంక్షేమ సంఘ అధ్యక్షుడు యాసలపు విష్ణు మాట్లాడుతూ, అమ్మవారికి పట్టు వస్త్రాలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, పిండివంటలు, గాజులు తదితర వస్తువులతో కూడిన సారెను భక్తులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రీ మహిషాసుర మర్దినిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు ప్రజలకు సిరి సంపదలు, పాడిపంటలు , సుఖ సంతోషాలు సౌభాగ్యాలను ప్రసాదించాలని కోరుకున్నట్లు భక్తులు వివరించారు. దసరా ఉత్సవాల వేళ అమ్మవారు తీసుకునే ప్రతి అలంకారం ఒక ప్రత్యేక సందేశాన్నిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు, గ్రామ పెద్దలు విస్తృత ఏర్పాట్లు చేశారు. శరన్నవరాత్రుల విశిష్టతను తెలియజేసే ప్రత్యేక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలు ముగిసే వరకు భక్తులందరూ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు యడ్ల రామసుబ్రహ్మణ్యం, సిరిపురపు సురేష్, బొడ్డు వెంకట రామకృష్ణ, కొల్లు రామనాయుడు ఆకాంక్షించారు. ఆదివారం మహా అన్నదానం జరుగుతుందని, భక్తులు, ప్రజలు, గ్రామస్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దమల్లాపురం కేంద్రంగా నూతన ఐటిడిఏ ఏర్పాటు చేయాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**శంఖవరం, విశ్వం వాయిస్ :** కాకినాడ జిల్లా ప్రతిపాడు, తుని నియోజకవర్గాల్లోని ఉప ప్రణాళికా ప్రాంత 59 గిరిజన గ్రామాలకు పెద్ద మల్లాపురం కేంద్రంగా నూతన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ను ఏర్పాటు చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరంకు బుధవారం ఉదయ్ శ్రీనివాస్ లేఖలను రాశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలతో పాటు తుని నియోజకవర్గం కోటనందూరు మండలాల్లో 95 శాతం గిరిజన కుటుంబాలు ఉన్నాయి అన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రంపచోడవరం ఐటిడిఏని అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపడంతో కాకినాడ జిల్లాలో గిరిజనులకు ఐటీడీఏ లేకుండా పోయిందన్నారు. దీంతో కాకినాడ జిల్లాలో ఉన్న సుమారు 1,84,400 మంది గిరిజనులకు పథకాలు అమలు, సౌకర్యాలు కల్పన భారంగా మారిందన్నారు, దీని అధిగమించేందుకు భౌగోళికంగా సౌకర్యంతంగా ఉన్న శంఖవరం మండలం, పెద్ద మల్లాపురం కేంద్రంగా నూతన ఐటీడీఏను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు, నూతన ఐటీడీఏ ఏర్పాటుతో గిరిజన గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పడడంతో పాటు, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. గిరిజనుల సంక్షేమం, పరిపాలనా సౌలభ్యం కోసం తక్షణం నూతన ఐటీడీఏ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. గతంలో పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన సహకార సంస్థ, శంఖవరం కేంద్రంగా ఐటిడిఏ. ఉప కార్యాలయం ఉండి, తదుపరి కాలంలో వాటిని ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని ఆ లేఖలో కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఉటంకించారు.

## పెట్టుబడుల కోసం పరుగో... పరుగు

**విశాఖపట్టణం :** విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు జరగనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు, నారా లోకేష్ బృందం సింగపూర్లో పర్యటించింది. అక్కడి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. అయితే తాజాగా విశాఖలో పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్. మధ్యాహ్నం కి ఢిల్లీ చేరుకొని.. ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఐటిసి మౌర్యలో జరిగే సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తారు. సీఐఐ ఆధ్వర్యంలో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సుకు తరలిరావాలని కోరనున్నారు.విశాఖ పెట్టుబడుల సదస్సును ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ముందుగానే సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే సీఎం చంద్రబాబు బృందం సింగపూర్ లో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయింది. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు వస్తే ఏపీ ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు సీఎం చంద్రబాబు. అంతకుముందు లండన్ లో పర్యటించారు నారా లోకేష్. అలాగే దావోస్ పర్యటనకు కూడా వెళ్లారు. ఆ సమయంలో కూడా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. వారితో ప్రత్యేక రోడ్డు షో నిర్వహించారు. వాటి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖ సదస్సుతో భారీగా పెట్టుబడులు తేవాలన్నది ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.మరోవైపు ఏపీ మంత్రుల బృందం దక్షిణ కొరియాలో పర్యటించింది. విశాఖలో నిర్వహించనున్న పారిశ్రామిక పెట్టుబడుల సదస్సుకు తరలి రావాలని అక్కడి ప్రతినిధులను కోరారు మంత్రులు. మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి తో పాటు సీనియర్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. దక్షిణ కొరియా రాజధాని సీయోల్ లో ఎల్జి కంపెనీ ప్రతినిధులతో మంత్రుల బృందం సమావేశం అయింది. మరోవైపు విద్యుత్తు వస్తువుల తయారీకి సంబంధించి ఎల్ ఎస్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులతో కూడా సమావేశం అయింది.

## డిసెంబర్‌లో పుతిన్ భారత్ రాక

న్యూఢిల్లీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2025, డిసెంబర్ ఐదారు తేదీలలో భారత్‌కు వచ్చి, ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకునే అవకాశం ఉందని సమాచారం. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా న్యూఢిల్లీపై శిక్షాత్మక సుంకాలను విధించిన దరిమిలా ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్న తరుణంలో పుతిన్, ప్రధాని మోదీల భేటీ కీలకంగా మారనుంది. గత ఆగస్టులో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ)అజిత్ దోవల్ మాస్కో పర్యటన సందర్భంగా ఈ ఉన్నత స్థాయి పర్యటనను తొలుత ప్రకటించారు. అయితే ఆ సమయంలో తేదీలను ఖరారు చేయలేదు. రష్యా అధ్యక్షుడు ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీని కలుసుకున్నారు. సుంకాల విషయమై న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతల మధ్య రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ రానుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత్– రష్యాలు ఎన్నో ఏళ్లుగా ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలు కలిగివున్నాయి. భారత్‌కు ఆయుధ సరఫరాదారులలో రష్యా ముందు వరుసలో ఉంటుంది. అలాగే రష్యన్ చమురును భారీగా దిగుమతి చేసుకుంటున్నదేశాలలో భారత్ ఒకటిగా నిలిచింది. కాగా అధ్యక్షుడు పుతిన్ పర్యటన భారత భౌగోళిక రాజకీయ వ్యూహాలలో కీలకంగా మారనుంది.

## గాజాలో దయనీయ స్థితి



ఇంటర్నెట్‌డెస్క్

ఇజ్రాయెల్–హమాస్ మధ్య నలిగిపోతున్న గాజా ప్రజలు అత్యంత దయనీయపరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నిలువనీడ లేక తినడానికి తిండి దొరక్క మానవతాసహాయంపై ఆధారపడి బతుకీడ్చుతున్నారు. తమ పిల్లలకింత తిండిపెట్టాలని ఆరాటపడుతూ ఏదైనా ఉపాధి దొరుకుతుందేమోనని చూసే మహిళలకు మాత్రం దారుణ పరిస్థితులు ఎదురవుతున్నాయి. వారు లైంగిక దోపిడీకి గురవుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆరుగురు పిల్లల ప్రాణాలు ఎలా నిలబెట్టుకోవాలా అని ఎదురుచూస్తోన్న 38 ఏళ్ల మహిళకు ఎయిడ్ ఏజెన్సీలో ఉపాధి కల్పిస్తానని ఒక వ్యక్తి హామీ ఇచ్చాడు. అందుకు బదులుగా అతడు తనను ఖాళీగా ఉన్న ఒక ఇంటికి తీసుకెళ్లాడని ఆమె మీడియాకు వెల్లడించింది. "అక్కడి నుంచి ఎప్పుడు బయటపడతానా అని అనుకున్నాను. తర్వాత అతడు 30 డాలర్లకు సమానమైన నగదు ఇచ్చాడు. కానీ ఎలాంటి ఉపాధి మాత్రం దొరకలేదు" అని వాపోయింది. ఇలా ఆరుగురు మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆహారం, డబ్బు, ఉపాధి పేరిట వారు తమను లొంగదీసుకున్నారని చెప్పారు. కొంతమంది పెళ్లిపేరిట మాయమాటలు చెప్పారన్నారు కల్లోలిత ప్రాంతాల్లో మహిళలు ఇలాంటి దుర్భరపరిస్థితులు ఎదుర్కోవడం కొత్తేంకాదని మానవతా సహాయం అందించే బృందాలు, మానవహక్కుల కార్యకర్తలు పేర్కొన్నారు. ఇలాంటి మానవతా సంక్షోభాలు ప్రజలను దుర్భలంగా మారుస్తాయని, వాటి పర్యవసానాల్లో లైంగిక హింస పెరగడం ఒకటని హ్యూమన్ రైట్స్ వాచ్ ప్రతినిధి హీథర్ బార్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇక గాజా మహిళలు, బాలికల దయనీయ పరిస్థితిని వెల్లడించడానికి మాటలు కూడా రావడంలేదని విచారం వ్యక్తంచేశారు. సహాయం పొందేందుకు లైంగిక దోపిడీ గురైన మహిళలకు తాము చికిత్స అందించినట్లు పాలస్తీనాకు చెందిన సైకాలజిస్టులు వెల్లడించారు. వారిలో కొందరు గర్భం దాల్చారని చెప్పారు. ఇలాంటి ఘటనల గురించి తమకు తెలుసని ఐరాస సంస్థలలో కలిసి పనిచేస్తోన్న మానవ హక్కుల సంస్థలు అంగీకరించడం గమనార్హం.

## మల్లికార్జున ఖర్గేకు పేస్‌మేకర్

బెంగళూరు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. మంగళవారం సదాశివనగర్‌లోని నివాసంలో ఉండగా ఆయనకు శ్వాసకోశ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి తరలించారు. హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో వైద్యులు బుధవారం ఆయనకు పేస్‌మేకర్ అమర్చినట్టు ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. 'వయో సంబంధిత సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా ఖర్గే ఆస్పత్రిలో చేరారు. హృదయ స్పందనలో తేడా ఉండడంతో దాన్ని సరిచేసేందుకు వైద్యులు ఆయన గుండెకు పేస్‌మేకర్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఒకరోజు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించారు' అని పేర్కొంటూ ప్రియాంక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సీఎం సిద్ధరామయ్య బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఖర్గేను పరామర్శించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. ఖర్గే ఆరోగ్యంగా ఉన్నారని, గురువారం డిశ్చార్జ్ అవుతారని చెప్పారు.


## సీఎం మార్పుపై సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు



'సీఎం మార్పు' అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. పూర్తి ఐదేళ్ల పదవీ కాలానికి తానే సీఎంగా ఉంటానని.. వచ్చే ఏడాది మైసూర్‌లో దసరాకీ తానే పూజ చేస్తానంటూ నొక్కి చెప్పారు. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ఊహాగానాలపై మాట్లాడుతూ.. "నేను రెండోసారి ముఖ్యమంత్రిని కాలేనని చాలామంది జోస్యం చెప్పారు, కానీ నేను అయ్యాను. నా కారుపై కాకి వాలడం దుశ్శకునం అని.. నేను సీఎం కొనసాగలేనని చాలామంది అన్నారు. నేను బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేనన్నారు.. కానీ ఏం జరిగింది" అంటూ చెప్పుకొచ్చారు. కాగా, గత కొంతకాలంగా కర్ణాటకలో 'సీఎం మార్పు'పై గందరగోళం కొనసాగుతన్న సంగతి తెలిసిందే.. తాజాగా డిప్యూటీ సీఎం శివకుమార్ దీనిపై స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీనికి కాలమే సమాధానం చెబుతుందని అన్నారాయన. ప్రపంచంలో ఏ మనిషైనా ఆశతోనే బతుకుతారని... ఆ ఆశే లేకుంటే జీవితమే లేదు. మీరడిగిన ప్రశ్నకు నేను కాదు.. కేవలం కాలమే దీనికి సమాధానం చెబుతుంది అని అన్నారాయన. సీఎం పదవి నిర్ణయం పార్టీ హై కమాండ్‌దేనని డీకే మరోసారి కుండబద్దలు కొట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2023 మే 20న అధికారంలోకి వచ్చింది. ఈ నవంబర్‌కు రెండున్నర సంవత్సరాలు పూర్తవుతాయి. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది.

# చొరబాటుదారులతో జాగ్రత్త

-మొదటిపేజీ తరువాయి




సంస్థ తన చరిత్రలో పలు దాడులకు గురయినప్పటికీ, దేశానికి ఎన్నడూ అపకారం తలపెట్టలేదని తెలిపారు. దేశమే ప్రథమం అనే భావనతో ఆర్ఎస్ఎస్ పని చేస్తోందని, పేదల జీవితాలను మార్చేందుకు కృషిచేసిందని కొనియాడారు. "దేశ ప్రజల్లో సామరస్య భావనను వ్యాప్తిచేయడం లక్ష్యంగా దేశమంతా ఆర్ఎస్ఎస్ విస్తరించి పనిచేస్తోంది. సమాజంలోని కుల,మత, జాతి బేధాలను నిర్మూలించడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు కార్యక్రమాలను చేపడుతోంది. సమ్మిళిత సమాజ సాధన ఈ సంస్థ ఆశయం" అని మోదీ వివరించారు. దేశం పట్ల అపార ప్రేమను కలిగిన ఆర్ఎస్ఎస్ బ్రిటిషర్ల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. "జాతీయోద్యమ కార్యకర్తలకు సంఘ్ వలంటీర్లు ఆశ్రయమిచ్చారు. స్వయంగా ఆ సంస్థ నాయకులు కూడా జైలుపాలయ్యారు. సంస్థ స్ఫూర్తిని అణచివేయడానికి పలు ప్రయత్నాలు జరిగాయి. అబాంఢాలు వేస్తూ తప్పుడు కేసులు నమోదయ్యాయి. అయినా, ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి అపకారం తలపెట్టలేదు. మంచి, చెడు.. రెండూ ఉండే సమాజంలో తననుతాను భాగం చేసుకుని పనిచేస్తోంది" అని మోదీ వివరించారు. 'ఆర్ఎస్ఎస్ చీఫ్ మాధవ్ గోల్వాల్కర్‌పై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన ప్రశాంత చిత్తంతో ఒక మాట అన్నారు. 'కొన్నిసార్లు మన నాలుక పంటి కింద పడి బాధిస్తుంది. అందుకని పళ్లను మనం పీకేసుకోం' అని సెలవిచ్చారు" అని తెలిపారు. ఎమర్జెన్సీ రోజులను మోదీ గుర్తుచేసుకుంటూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఉన్న తిరుగులేని విశ్వాసమే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆర్ఎసఎసను పోరాడేలా చేసిందని తెలిపారు. కాగా, సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా రూ.వంద నాణెం, స్టాంప్‌ను ప్రధాని ఆవిష్కరించారు. నాణెం ఒకవైపు జాతీయచిహ్నం, రెండో వైపు భరతమాత చిత్రం ఉన్నాయి. నాణెంపై భరతమాత చిత్రం ముద్రించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని మోదీ తెలిపారు.

**'పంద్రాగస్టు' ప్రసంగాన్ని గుర్తు తెస్తూ**

ప్రధాని వ్యాఖ్యలు 'ఆగస్టు 15' ప్రసంగాన్ని గుర్తుకు తెచ్చాయి. ఈ సందర్భంగా 'డెమోగ్రాఫికల్ మిషన్'ను ప్రకటించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వేదికపైనా అదే చెప్పారు. బెంగాల్ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతాబెనర్జీ ఓటు రాజకీయాలు చేస్తున్నారని అప్పట్లో మోదీ దుయ్యబట్టారు. ఇందులోభాగంగానే ముస్లిం ప్రాబల్యం కలిగిన బంగ్లాదేశ్‌కు చెందిన చొరబాటుదారులను బలపరుస్తున్నారని ఆయన మండిపడ్డారు. మోదీ వ్యాఖ్యలను ఆనాడు అంతే దీటుగా తృణమూల్ కాంగ్రెస్ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. సరిహద్దు భద్రత కేంద్ర పరిధిపలోని అంశమని, అందులో ఉత్పన్నమయ్యే సమస్యలను కేంద్రమే పరిష్కరించాల్సి ఉంటుందని ఆనాడు మమతాబెనర్జీ స్పష్టం చేశారు.

# లోకల్ బ్రాండ్స్‌కు సై!

**స్థానిక బ్రాండ్స్ నుంచే నిజాయితీగా సమాచారం**

**మహిళలు నడిపే వ్యాపారాలకు యూత్ మద్దతు**

**సహజ పదార్థాలతో తయారైన వాటివైపే మొగ్గు**

**ఆఫ్‌లైన్ షాపింగ్‌కు దక్షిణ భారత కస్టమర్ల ఆసక్తి**



ఒక్కో ప్రాంతం, తరం, స్త్రీ, పురుషులను బట్టి కొనుగోలు తీరుతెన్నులు మారుతున్నాయి. మహిళల నేతృత్వంలోని బ్రాండ్స్‌కు ఉత్తర భారతంలో ఆదరణ ఎక్కువ. దక్షిణాది కస్టమర్లు సంప్రదాయానికి పెద్దపీట వేస్తున్నారు. అంతేకాదు ఆఫ్‌లైన్ షాపింగ్‌కు మొగ్గుచూపుతున్నారు.

భారతీయ వినియోగదారుల కొనుగోలు తీరును, ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి.. అంతర్జాతీయ మార్కెట్ పరిశోధన సంస్థ 'యూగోవ్' సహకారంతో 18 రాష్ట్రాల్లోని 5,000 మంది వినియోగదారులతో వెంచర్ క్యాపిటల్ సంస్థ 'రుకమ్ క్యాపిటల్' నిర్వహించిన ఆన్ లైన్ సర్వేలో అనేక ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

**ప్రాంతం బట్టి ప్రాధాన్యతలు**

పశ్చిమ భారతం: స్వదేశీ బ్రాండ్స్ అంటే మక్కువ. పండుగ సమయంలో కార్డ్ ఆధారిత చెల్లింపులు అధికం. ఏఐ/వర్చువల్ ట్రై%–%ఆన్ ్స ప్రయత్నించడం అంటే విపరీతమైన ఆసక్తి. సంస్కృతి, స్థానిక ఉత్పత్తులు, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఇష్టపడుతున్నారు.

తూర్పు భారతం: పర్యావరణ అనుకూల, మన్నికగల ఉత్పత్తులకు మొగ్గు చూపుతారు. కూపన్ ్స, సేల్ డేస్, బహుమతులను కోరుకునే కస్టమర్లు. సాంస్కృతిక విలువలు, ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులను ఇష్టపడతారు.

ఉత్తర భారతం: మహిళల నేతృత్వంలోని బ్రాండ్స్‌కు ఆదరణ ఎక్కువ. కంపెనీలతో భావోద్వేగ బంధం ఉంది.. ఇన్ ఫ్లుయెన్సర్ల ప్రభావం అధికం. ప్రకటనలను ఇట్టే గ్రహిస్తారు.

దక్షిణ భారతం: సంప్రదాయానికి పెద్దపీట వేస్తారు. దుకాణాలకు వెళ్లి షాపింగ్ చేయడానికి ప్రాధాన్యత ఇస్తారు. ఉత్పత్తులపట్ల వ్యామోహంతోనే కొనుగోళ్లు అధికం. సెలబ్రిటీలు చేశారు కదా అని ఆ ప్రకటనల ఆధారంగా కొనుగోళ్లు చేయడం తక్కువ. అత్యధిక శాతం మంది పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

' ఆరోగ్యం, సంరక్షణ విభాగంలో పూర్తిగా సహజ పదార్థాలతో తయారు చేసిన ఉత్పత్తులను అందించే బ్రాండ్స్‌నే ఇష్టపడతామని 100% మంది చెప్పడం విశేషం. పర్యావరణ అనుకూల ఉత్పత్తులకే ప్రాధాన్యత అని 76% మంది స్పష్టం చేశారు.

' 50% కంటే ఎక్కువ మంది.. పండుగల సమయంలో ఆరోగ్యకరమైన స్నాక్స్ కొనాలని భావిస్తున్నారు. 40% మంది చక్కెర రహిత ప్రత్యామ్నాయాలను ఎంచుకున్నారు.

' ప్రథమ శ్రేణి నగరాల్లోని వినియోగదారుల్లో 57% మంది ఆరోగ్యకరమైన స్నాక్స్, 41% మంది చక్కెర రహిత స్వీట్లను ఎంచుకున్నారు. తృతీయ శ్రేణి నగరవాసుల్లో 65% మంది సంప్రదాయ స్వీట్లను తింటామని తెలిపారు.

**మహిళలను ప్రోత్సహించేలా..**

' 58% మంది స్థానిక/స్వదేశీ బ్రాండ్స్‌ను ఇష్టపడుతున్నారు.

' కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల నిబద్ధత ఉండే, అధిక వ్యయం చేసే కంపెనీల ఉత్పత్తులు కొనేందుకు 56% మంది ఆసక్తి చూపారు.

' కొత్త స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు చాలామంది ముందుకు వచ్చారు. వారి నుంచి ఉత్పత్తులు కొనేందుకు తాము సిద్ధమని 43% మంది వెల్లడించారు.

' మహిళలు నడిపే వ్యాపారాల నుంచి మాత్రమే షాపింగ్ చేస్తామని 68% మంది మిలీనియల్స్, జెన్%–%జీ తరం వాళ్లు చెప్పడం విశేషం.

' 14% మంది 20%–%30% అధిక ధర చెల్లించడానికి సిద్ధం.

' పండుగ షాపింగ్ విషయానికి వస్తే ప్రథమ శ్రేణి నగరాల్లో స్వదేశీ బ్రాండ్స్ వైపు 61% మొగ్గు చూపుతున్నారు.

' స్థానిక బ్రాండ్లు రోజువారీ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందిస్తున్నాయి. నిజాయితీగా ఈ కంపెనీలిచ్చే ప్రామాణిక సమాచారాన్ని అభినందిస్తున్నట్లు 76% మంది తెలిపారు.

' ఇతర దేశాల్లో లేదా సంస్కృతిలో ప్రసిద్ధి చెందిన ఉత్పత్తులను విక్రయించే బ్రాండ్స్ నుంచి కొనుగోలు చేసినట్టు 59% మంది చెప్పారు.

వీటి ఆధారంగా.. బ్రాండ్ ఎంపిక, కొనుగోలును ఏయే అంశాలు ప్రభావితం చేస్తున్నాయంటే..

48% ఈ%–%కామర్స్ పోర్టల్స్‌లో సేల్ డేస్
47% ఫెస్టివ్ సేల్ / ఎండ్ ఆఫ్ సీజన్ సేల్
47% ఆఫర్లు, డిస్కౌంట్లకు గూగు ల్/ఆన్ లైన్ లో సెర్చ్
42% బ్రాండ్ వెబ్‌సైట్లలో ఆఫర్లు

**అందుకే కొనడంలేదు**

బ్రాండ్ ఉత్పాదన కొనుగోలుకు నిరోధకాలు
కాలక్రమేణా ఉత్పత్తి నాణ్యత మారుతోంది 29%
తక్కువ ధరకు ఇలాంటి ఉత్పత్తి దొరికింది 28%
కస్టమర్ కేర్ నుంచి కరువైన ప్రతిస్పందన 26%
షిప్పింగ్ ఆలస్యం / అధిక చార్జీలు 25%
ఈ బ్రాండ్ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచివి కావు 25%

## రక్షణ రంగం అభివృద్ధికి వినూత్న వ్యవస్థ

భారత రక్షణరంగంలో పరిశోధనను, అభివృద్ధిని బలోపేతం చేయడానికి వినూత్న వ్యవస్థను వృద్ధిచేస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగిందని, ఇది మనకు ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలు ఏళ్లుగా జరిగిన పరిశోధన, అభివృద్ధి ఆధారంగా రూపొందించినవని రాజ్‌నాథ్ చెప్పారు. ఆ సాంకేతికతలను మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారిపోతున్నాయని, భద్రతా అవసరాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అందుకే రక్షణ బడ్జెట్ కూడా ఏటా పెరుగుతుందని అన్నారు. బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయ్యిందన్నారు. రక్షణరంగంలో సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి చెప్పారు. మన సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

## మావోయిస్టుల కుట్ర భగ్నం

### భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు మావోయిస్టుల కుట్రను భగ్నం చేయడంలో విజయం సాధించాయి. పామెడ్ ప్రాంతంలోని కొరగుట్ట అడవుల్లో కోబ్రా 208 బెటాలియన్ ఇటీలి కాలంలో ముమ్మరంగా మావోయిస్టుల కోసం గాలిస్తోంది. ఈ నేపథ్యంలో మావోయిస్టులు పెద్ద మొత్తంలో దాచిపెట్టిన పేలుడు పదార్థాలను, రోజువారీ ఉపయోగించే వస్తువుల డంప్‌ను బెటాలియన్ స్వాధీనం చేసుకుంది. ఈ పేలుడు పదార్థాలను కోబ్రా 208 బెటాలియన్ కాంచల్ గ్రామ అడవుల్లోని ఒక గొయ్యిలో కనుగొంది. ఈ పేలుడు పదార్థాలను మావోయిస్టులు ఏదో భారీ కుట్ర కోసం సేకరించారని భద్రతా దళాలు భావిస్తున్నాయి. కోబ్రా 208 బెటాలియన్ సకాలంలో అప్రమత్తం కావడంతో మావోయిస్టుల కుట్ర విఫలమయ్యిందని 'హరిభూమి' తన కథనంలో పేర్కొంది.

బిజినెస్

# ఎస్‌బీఐ కార్డ్ కొత్త ఛార్జీలు..

# రూ.1000 దాటితే బాదుడే

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కార్డ్ కీలక ప్రకటన చేసింది. క్రెడిట్ కార్డు యూజర్లకు షాకిచ్చింది. రుసుములు పెంచుతున్నట్లు తెలిపింది. ఫీ స్ట్రక్చర్, ఇతర ఛార్జీలను సవరించినట్లు నవంబర్ 1, 2025 నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లు, వాలెట్ లోడింగ్ వంటి ఎంపిక చేసిన ట్రాన్సాక్షన్లకు ఈ కొత్త ఛార్జీలు వర్తిస్తాయని వెల్లడించింది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు యూజర్లు తప్పనిసరిగా కొత్త ఛార్జీల వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి అవాంచిత అదనపు ఛార్జీలను తప్పించుకునేందుకు ఫీ స్ట్రక్చర్ కచ్చితంగా తెలుసుకోవాలి. క్రెడ్, చెక్, మొబి క్విక్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ ద్వారా చేసే ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లపై కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. ట్రాన్సాక్షన్ అమౌంట్‌లో 1 శాతం ఫీ ఉంటుందని ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. అయితే నేరుగా స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలకు నేరుగా పీఓఎస్ ద్వారా పేమెంట్లు చేస్తే ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపింది. వాలెట్ లోడింగ్ చేసేవారికి షాక్. రూ.1000 దాటి వాలెట్ లోడింగ్ ట్రాన్సాక్షన్లు చేస్తే 1 శాతం ట్రాన్సాక్షన్ అమౌంట్ ఛార్జీ పడుతుంది. ఎంపిక చేసిన మెర్చంట్ కోడ్స్ పరిధిలోని ట్రాన్సాక్షన్లకు కొత్త ఛార్జీలు వర్తిస్తాయని ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. థర్డ్ పార్టీ మెర్చంట్స్‌కు చెందిన ఎడ్యుకేషన్ పేమెంట్ల ఛార్జీలను మెర్చంట్ కేటగిరీ కోడ్ ఎంసీసీ 8211, 8220, 8241, 8244, 8249, 8299గా తెలిపింది. క్యాష్ పేమెంట్స్, చెక్ పేమెంట్స్, కార్డ్ రీప్లేస్మెంట్, లేట్ పేమెంట్ వంటి వివిధ సేవలకు ఫీ, ఛార్జీలు వసూలు చేస్తోంది ఎస్‌బీఐ కార్డ్. అయితే, ఆయా ట్రాన్సాక్షన్ల ఛార్జీలను ప్రస్తుతానికి మార్చలేదు. ప్రస్తుతానికి క్యాష్ పేమెంట్ ఫీ రూ.250గా ఉంది. అలాగే పేమెంట్ ఆలస్యమేతం 2 శాతం ఛార్జీలు పడతాయి. కనీసం రూ.500 ఉంటుంది. చెక్ పేమెంట్ ఛార్జీలు రూ.200గా ఉంటాయి.




## ఆర్‌బీఎల్ బ్యాంకులో ఎల్ఐసీ బీమా పాలసీలు




దేశీయ అతిపెద్ద బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)తో బ్యాంకస్యురెన్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంకు మంగళవారం ప్రకటించింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో ఆర్‌బీఎల్ బ్యాంకు కస్టమర్లు బ్యాంకు బ్రాంచ్‌లు, డిజిటల్ ఛానెళ్ల ద్వారా ఎల్ఐసీకి చెందిన అన్ని రకాల జీవిత బీమా పాలసీలను పొందడానికి వీలు కల్పిస్తుందని బ్యాంకు అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఆర్‌బీఎల్ బ్యాంక్ కస్టమర్లకు టర్మ్ ప్లాన్‌లు, ఎండోమెంట్ పాలసీలు, పెన్షన్, యూనిట్-లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లు అందుబాటులో ఉంటాయి. ఎల్ఐసీకి 3,600 కంటే ఎక్కువ బ్రాంచ్‌లు, కార్యాలయాలకు తోడు ఆర్‌బీఎల్ బ్యాంక్ 2,000 కంటే ఎక్కువ టచ్‌పాయింట్‌ల నెట్‌వర్క్ బలం దేశవ్యాప్తంగా జీవిత బీమా విస్తరణ సులభతరం అవుతుంది. '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని బ్యాంకు పేర్కొంది.

## రూ. 60 వేలు కోట్లు దాటిన పండుగ సీజన్ అమ్మకాలు



ఈ ఏడాది పండుగ సీజన్‌కు భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి. కేంద్రం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలతో అనేక నిత్యావసర వస్తువులపై ధరలు తగ్గడం, డిస్కౌంట్లు, క్విక్ డెలివరీలలో పెరుగుదల ఈ ఏడాది పండుగ సీజన్ అమ్మకాలను పెంచాయి.దీంతో మొదటి వారంలోనే అమ్మకాల విలువ దాదాపు రూ. 60,000 కోట్లకు చేరుకున్నాయి. ప్రముఖ మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ డాటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు రూ. 60,700 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఇది గతేడాదితో పోలిస్తే 29 శాతం అధికం. మొత్తం ఈ ఏడాది పండుగ సీజన్ అమ్మకాలు 27 శాతం ఎక్కువగా రూ. 1.2 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. అంతకుముందు, రెడ్‌సీర్ దీపావళికి ముందు 30-35 రోజుల్లో ఈ-కామర్స్ అమ్మకాలు రూ. 1.15 లక్షల కోట్ల ఆదాయాన్ని సాధిస్తాయని అంచనా వేసింది. ఇది గతేడాదితో పోలిస్తే 20-25 శాతం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్‌లో ప్రకటించిన జీఎస్టీ రేట్ల కోత, అనేక పెద్ద గృహోపకరణాలు, సాధారణ వస్తువులు, దుస్తులపై పన్నులను తగ్గించడం, అనేక ఉత్పత్తులు రిటైల్ మార్కెట్లో 6-8 శాతం చౌకగా మారడం ద్వారా అమ్మకాలకు ఊతమిచ్చాయని డాటమ్ ఇంటెలిజెన్స్ అభిప్రాయపడింది. వీటికి తోడు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ-కామర్స్ కంపెనీలు గత వారమే సేల్స్‌ను ప్రారంభించాయి. డేటా ప్రకారం, మొబైల్స్ అత్యధిక ఆదాయాన్ని (42 శాతం వాటా) ఇస్తూ అగ్రస్థానంలో నిలిచాయి. క్విక్ కామర్స్ వ్యాపారాలు వేగంగా విస్తరించడంతో కిరాణా సరుకులు(44 శాతం) వేగంగా పెరుగుతున్నాయి.

## సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన ఆటో మొబైల్ సేల్స్



సెప్టెంబర్‌లో రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలుగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది.వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నాటికి మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని.. పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళు మందగించాయి. పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృపక్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని.. జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది.

## వడ్డీరేట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన.. లోన్లు కట్టే వారికి నో రిలీఫ్



వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన చేసింది. మార్కెట్ వర్గాల అంచనాల మేరకు ఈసారి రెపోరేటును స్థిరంగా ఉంచింది. సెప్టెంబర్ 29న ప్రారంభమైన మానిటరీ పాలసీ కమిటీ సమావేశం.. అక్టోబర్ 1న ముగియగా.. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రకటించారు. వడ్డీరేట్లను వరుసగా రెండోసారి 5.5 వద్దే ఉంచుతున్నట్లు వెల్లడించారు.ఈ ఏడాది తొలి అర్థభాగంలో ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో వడ్డీరేట్లను 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆగస్టులో వడ్డీరేట్లను స్థిరంగా ఉంచింది. ఆగస్టు నెలలో దేశ వార్షిక ద్రవ్యోల్బణం 2.07 శాతానికి పెరిగిందని, ఆహారం ధరలు పెరగడమే ఇందుకు కారణమని సంజయ్ మల్హోత్రా చెప్పారు. ఆహార ధరలు తగ్గడం, పన్ను రేటు కోతలు కారణంగా ద్రవ్యోల్బణం అంచనాలు మరింత సానుకూలంగా మారాయని ఎంపిసి గమనించిందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తన ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో సీపీఐ (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) ఆధారిత ద్రవ్యోల్బణం 4 లేదా అంతకంటే తక్కువ శాతంలో ఉండే అవకాశాలు ఉన్నట్లు ఎస్‌బిఐ అంచనా వేసింది. జీఎస్టీ తగ్గించడంతో అక్టోబర్ లో మరింత తగ్గే అవకాశాలున్నట్లు భావించింది. దీనివల్ల ఆర్బీఐ వడ్డీరేటును మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించే ఆస్కారం ఉందని అంచనా వేయగా.. ఎస్‌బిఐ అంచనాలకు భిన్నంగా ఆర్‌బిఐ రెపోరేటును యథాతథంగా ఉంచింది. రెపోరేటు తగ్గితే లోన్ ఈఎంఐ తగ్గుతుందని ఎదురుచూసిన వారికి నిరాశ ఎదురైంది.

---

# చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ..

# సరికొత్త ప్రపంచ రికార్డు

టీమిండియా నయా విధ్వంసకర వీరుడు అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన బ్యాటర్‌గా సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆసియా కప్ 2025లో అదిరిపోయే ప్రదర్శనల తర్వాత అభిషేక్ నంబర్ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు రేటింగ్ పాయింట్లను గణనీయంగా పెంచుకున్నాడు. ఇవాళ (అక్టోబర్ 1) విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ రేటింగ్ పాయింట్లు 931కు చేరుకున్నాయి. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ చరిత్రలో ఇప్పటివరకు ఎవరికీ ఇన్ని రేటింగ్ పాయింట్లు లేవు. గతంలో ఈ రికార్డు ఇంగ్లండ్ ఆటగాడు డేవిడ్ మలాన్ పేరిట ఉండేది. మలాన్ తన కెరీర్‌లో అత్యుత్తమంగా 919 రేటింగ్ పాయింట్లు సాధించాడు. భారత్ తరఫున అభిషేక్‌కు ముందు అత్యధిక రేటింగ్ పాయింట్లను సూర్యకుమార్ యాదవ్ సాధించాడు. స్కై తన కెరీర్‌లో అత్యుత్తమంగా 912 రేటింగ్ పాయింట్లు సాధించాడు. స్కై తర్వాతి స్థానంలో విరాట్ కోహ్లి ఉన్నాడు. విరాట్ తన కెరీర్‌లో అత్యుత్తమంగా 909 రేటింగ్ పాయింట్లు సాధించాడు.



**అత్యధిక ఐసీసీ రేటింగ్ పాయింట్లు సాధించిన టీ20 బ్యాటర్లు (టాప్-5)**

- అభిషేక్ శర్మ- 931
- డేవిడ్ మలాన్- 919
- సూర్యకుమార్ యాదవ్- 912
- విరాట్ కోహ్లి- 909
- ఆరోన్ ఫించ్- 904

కాగా, తాజాగా ముగిసిన ఆసియా కప్‌లో అభిషేక్ శర్మ అత్యుత్తమ ప్రదర్శనలతో చెలరేగాడు. ఈ టోర్నీలో 7 మ్యాచ్‌లు ఆడి 200 స్ట్రయిక్‌రేట్‌తో 44.86 సగటున 314 పరుగులు చేశాడు. ఇందులో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

# వైభవ్, వేదాంత్ శతకాలు..

# టీమిండియా భారీ స్కోర్

ఆస్ట్రేలియా పర్యటనలో భారత యువ జట్టు (అండర్-19) దుమ్మురేపుతుంది. తొలుత వన్డే సిరీస్‌ను క్లీన్ చేసిన భారత్.. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఘనంగా ప్రారంభించింది. బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగుల భారీ స్కోర్ చేసింది.ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (86 బంతుల్లో 113బీ 9 ఫోర్లు, 8 సిక్సర్లు), మిడిలార్డర్ బ్యాటర్ వేదాంత్ త్రివేది (192 బంతుల్లో 140బీ 19 ఫోర్లు) శతకాలతో కదంతొక్కారు. ఖిలన్ పటేల్ (49) రాణించాడు. ఆయుశ్ మాత్రే (21), అభిగ్యాన్ కుందు (26), రాహుల్ కుమార్ (23) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో కెప్టెన్ విల్ మలాజ్‌చుక్, హేడెన్ స్కిల్లర్ తలో 3 వికెట్లు తీయగా.. ఆర్యన్ శర్మ 2, థామస్ ప్యాడింగ్టన్ ఓ వికెట్ దక్కించుకున్నాడు. అంతకుముందు భారత బౌలర్లు చెలరేగడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగలకు ఆలౌటైంది. పేసర్ దీపేశ్ దేవేంద్రన్ (16.2-6-45-5) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ పతనాన్ని శాశించాడు. మరో పేసర్ కిషన్ కుమార్ (16-4-48-3) కూడా సత్తా చాటాడు. అన్మోల్జీత్ సింగ్, ఖిలన్ పటేల్ తలో వికెట్ తీశారు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో వన్ డౌన్ బ్యాటర్ స్టీవెన్ హొగన్ (246 బంతుల్లో 92) ఒక్కడే రాణించాడు. భారత్‌కు 185 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ప్రస్తుతం ఆట రెండో రోజు మూడో సెషన్ నడుస్తుంది.



స్పోర్ట్స్

## ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్.. భారత్-శ్రీలంక మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు..!



ఐసీసీ వన్డే వుమెన్స్ వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. భారత్-శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. ఈ ప్రారంభ మ్యాచ్‌ను చూసేందుకు దాదాపు 23వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. ఇది ఐసీసీ మహిళల టోర్నమెంట్ గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డు కావడం విశేషం. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను 22,843 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. గతేడాది దుబాయిలో జరిగిన వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌కు 15,935 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఐసీసీ వుమెన్స్ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్ 22,843 మంది హాజరయ్యారని.. ఇది ఐసీసీ వుమెన్స్ టోర్నమెంట్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 59 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీ గ్రాండ్‌గా ప్రారంభించింది. దీప్తి శర్మ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళా జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది. దీప్తి, అమంజోత్ కౌర్ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 47 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 269 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తి బ్యాట్‌తో పాటు బంతితో అద్భుతంగా రాణించింది. మూడు వికెట్లు పడగొట్టింది. శ్రీలంక తరఫున 43 పరుగులతో చమరి అటపట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. నీలాక్షి డిసిల్వా 35, హర్షిత సమరవిక్రమ 29, అచ్చిని కులసూర్య 17 పరుగులు చేశారు. దీప్తి మూడు వికెట్ల పడగొట్టగా.. స్నేహ రాణా, శ్రీ చరణి చెరో రెండు వికెట్లు తీశారు. క్రాంతి గౌడ్, అమంజోత్ కౌర్, ప్రతీకా రావల్‌కు చెరో వికెట్ దక్కింది.




# థియేటర్‌లో ఆదరణ లేదు.. ఓటీటీలో మాత్రం ఘాటికి మంచి రెస్పాన్స్ !

సీనియర్ నటి అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'ఘాటి' రీసెంట్‌గా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి రూపొందించిన ఈ యాక్షన్ డ్రామా సినిమాపై విడుదలకు ముందు భారీ అంచనాలు ఏర్పడినప్పటికీ, విడుదల తర్వాత మాత్రం ప్రేక్షకుల్లో మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో అనుష్క శెట్టి ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఆమె ఎమోషనల్ సీన్స్‌లో చూపిన నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. ముఖ్యంగా ఒక పూజా సీన్ ఆమె కెరీర్‌లో హైలైట్‌గా నిలిచిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఆమె పెర్ఫార్మెన్స్‌ను "సలార్", "కేజీఎఫ్" లెవెల్‌కి పోల్చుతూ ప్రశంసించారు. అయితే అనుష్క నటన ఎంతగానో మెప్పించినా, సినిమా కథ, స్క్రీన్‌ప్లే మాత్రం ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయాయి. పేసింగ్ నెమ్మదిగా ఉందని,ఇంటర్వెల్ వరకూ కథ సాగదీసినట్టుంది అని, కొన్ని యాక్షన్ సీన్స్ పండించలేకపోయాని చెప్పుకొస్తున్నారు. సినిమాలో కూడా కొత్తదనం లేదని, స్లోగా కథ నడిచినట్టు అనిపించిందని ప్రేక్షకుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సీన్లు రిపిటేటివ్‌గా అనిపించాయని కూడా విమర్శలు వచ్చాయి. కొన్నిచోట్ల విజువల్స్ ఆకట్టుకున్నటికీ, పూర్తిగా ప్రభావితం చేయలేకపోయాయి. బీజీఎం కొన్ని సీన్లలో బాగున్నా, ఎమోషనల్ కంటెంట్‌ను బలంగా తీసుకురాలేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మొత్తంగా సినిమా థియేటర్స్‌లో అంతగా అలరించలేకపోయింది. సెప్టెంబర్ 26 నుండి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న ఘాటి నంబర్ వన్ ట్రెండింగ్ లో దూసుకుపోతున్నట్టుగా తెలుస్తుంది. 40 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రిష్–అనుష్క కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కాబట్టి హోప్స్ భారీగానే పెట్టుకున్నారు. కాని మూవీ చూశాక ప్రేక్షకులు అంతగా సంతృప్తి చెందలేదు.



# ఆమె లేకపోతే ఇదంతా నా వల్ల అయ్యేదే కాదు : హీరో అజిత్

కోలీవుడ్‌లో నటుడు అజిత్ రూటే సపరేట్ అని చాలాసార్లు చెప్పుకున్నాం. ఆయన లోకమే వేరు. అజిత్ ది చాలా క్రియేటివ్ మైండ్. మొదటి నుంచి నటనపై దష్టి సారించి అగ్ర కథానాయకుడిగా ఎదిగారు. ఆ మధ్య ఒక ప్రముఖ విశ్వవిద్యాలయం విద్యార్థులకు హెలీకాప్టర్ టెస్ట్ పైలెట్ గానూ,ఎడ్వైజర్ గానూ వ్యవహరించారు. ఆ తరువాత గన్ షూటింగ్ పోటీల్లోనూ పాల్గొన్నారు. ఆ తరువాత బైక్ రేసుల్లోనూ పాల్గొన్నారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయి కారు రేసుల్లోను పాల్గొంటూ పతకాలను సాధిస్తున్నారు. అజిత్ కుమార్ రేసింగ్ పేరుతో సొంతంగా పందెం పోటీలు సంస్థను ప్రారంభించారు. అలా తన రేస్ టీమ్‌తో ఇప్పటికే దుబాయి, బెల్జియం వంటి దేశాల్లో కార్ రేసుల్లో పోటీ చేసి తృతీయ స్థాయి పతకాలను గెలిచారు. తాజాగా శని, ఆదివారాల్లో స్పెయిన్‌లో జరిగిన కార్ రేసుల్లో పాల్గొని మరోసారి కాంస్య పతాకాన్ని గెలిచారు. కాగా ఈయన తాజాగా కథానాయకుడిగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. దీంతో త్వరలో కొత్త చిత్రానికి రెడీ అవుతున్నారు. ఇది అజిత్ నటించే 64వ చిత్రం అవుతుంది. ఈ సందర్భంగా అజిత్ ఒక భేటీలో పేర్కొంటూ తన తదుపరి కార్ రేస్ పోటిలో ఇండియన్ సినిమాను ప్రమోట్ చేయనున్నారని తెలిపారు. అలా తన కారుపై ఇండియా సినిమా లోగో ను పొందుపరచనున్నట్లు చెప్పారు. తన భార్య శాలిని గురించి పేర్కొంటూ ఆమె ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తోందని చెప్పారు. ఆమె సహకారం లేకపోతే ఇదంతా చేయడం తన వల్ల అయ్యేది కాదన్నారు. తాను లేనప్పుడు ఇల్లు, పిల్లల బాధ్యతలు తానే చూసుకుంటోందని చెప్పారు. తాను పిల్లల్లి చూడడం కూడా అరుదైపోయిందన్నారు. మీరు ఇష్టమైనది చేయాలనుకుంటే కొన్ని సమయాల్లో కొన్ని త్యాగం చేయక తప్పదన్నారు. తాను కొడుకు ఆద్విక్ కూడా బైక్ రేసీలంటే ఇష్టమే నన్నారు. తన గో కార్డింగ్ ప్రారంభించారని, అయితే అందులో ఇంకా పూర్తి శ్రద్ధ పెట్టలేదని పేర్కొన్నారు. సినిమా అయినా, రేసులు అయినా తన భావాలను పిల్లలపై బలవంతంగా రుద్దనన్నారు. వారు ఏం చేయాలనుకుంటారో అందుకు తన మద్దతు ఉంటుందని అజిత్ స్పష్టం చేశారు.




# విష్ణు విశాల్ నుంచి మరో క్రేజీ థ్రిల్లర్.. 'ఆర్యన్' టీజర్ విడుదల

ప్రముఖ తమిళ నటుడు విష్ణు విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ సినిమా టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'ఆర్యన్' టీజర్.. ఒక హత్య కేసు దర్యాప్తు నేపథ్యంలో మొదలయ్యే డార్క్ ఇంటెన్స్ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. విష్ణు విశాల్ ఇందులో శక్తివంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన గతంలో నటించిన సంచలన థ్రిల్లర్ 'రాట్ససన్' తర్వాత మరోసారి పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. విష్ణు విశాల్‌తో పాటు సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జిబ్రాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణు విశాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# మన శంకరవరప్రసాద్ గారు: శశిరేఖ అందాన్ని చూశారా?

మెగాస్టార్ చిరంజీవి కొణిదెల హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ మన శంకరవరప్రసాద్‌గారు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో నయనతార కథానాయికగా నటిస్తోంది. ఈ మధ్యే చిరు–నయనతార కాంబినేషన్‌లో ఓ సాంగ్ షూటింగ్ కూడా పూర్తయింది. తాజాగా ఈ మూవీ నుంచి నయనతార ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. ఆమె పాత్ర పేరును శశిరేఖగా పరిచయం చేశారు.

పసుపురంగు చీరలో, కొప్పున పూలెట్టుకుని, చేతిలో ఓ గొడుగు పట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుతోంది నయన్. రేపు (అక్టోబర్ 2న) దసరా కానుకగా ఓ సర్‌ప్రైజ్ ఉంటుందన్నారు. అంటే మూవీ నుంచి ఏదైనా గ్లింప్స్ విడుదల చేసే అవకాశం ఉండొచ్చన్నమాట! ఇక ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2026 సంక్రాంతికి విడుదలవుతోంది.






# ధనుష్ 'తేరే ఇష్క్ మే' టీజర్ విడుదల

తనకు బాలీవుడ్‌లో రాన్‌జానా వంటి సూపర్ హిట్‌ని అందించిన దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్‌తో ధనుష్ ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'తేరే ఇష్క్ మే' అంటూ రాబోతున్న ఈ సినిమాలో ధనుష్ ఎయిర్‌ఫోర్స్ అధికారిగా కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో కృతి సనన్ కథానాయికగా నటించబోతుండగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం హిందీతో పాటు తమిళంలో నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. ధనుష్ ప్రేమలో మోసపోయిన వ్యక్తిగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. నా తండ్రిని దహనం చేయడానికి బనారస్ (కాశీ) వెళ్లాను. అప్పుడే నీకోసం కొంత పవిత్ర గంగాజలం తేవాలి అనుకున్నాను. నువ్వు కోత్త జీవితం ప్రారంభించబోతున్నావు కదా. కనీసం నీ పాత పాపలను కడుక్కో. అంటూ కృతితో ధనుష్ చెప్పే డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాకు హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ కథను అందిస్తుండగా.. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహిస్తున్నాడు. భుషణ్ కుమార్, కృష్ణ కుమార్, ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com